www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 223 | గురువారం 15.10.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

విలేకరులు కావలెను

18సం॥ లుగా వెలుపడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039






# 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి పెంచుతాం

ఎన్నికలప్పుడే రాజకీయాలు.. అభివృద్ధిలో కాదు

## పెట్టుబడిదారులకు ప్రభుత్వ అండ.. సీఎం భరోసా

## క్యూర్, ప్యూర్, రేర్‌తో తెలంగాణ అభివృద్ధికి ప్రణాళిక

- 2047 వికసిత్ భారత్‌కు రాష్ట్రాల సహకారం కీలకం: రేవంత్‌రెడ్డి
- తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణను గమ్యస్థానంగా మారుస్తాం
- ఎన్నికలప్పుడే రాజకీయాలు.. అభివృద్ధిలో కాదు: సీఎం
- దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి పెంచుతాం
- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించాలి
- యువత, మహిళలే పారిశ్రామిక అభివృద్ధికి కీలకం
- హైదరాబాద్‌ను గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా ముందుకు సాగుదాం

02

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ - 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారని.. ఇందుకు రాష్ట్రాల సహకారం అవసరమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని.. అభివృద్ధి విషయంలో కాదని స్పష్టం చేశారు. 2047 నాటికి స్వతంత్ర భారతం వందేళ్లు పూర్తి చేసుకోబోతుందని తెలిపారు. సమాఖ్య అనే పదానికి చాలా బలం ఉందని చెప్పుకొచ్చారు. పురాతన కాలంలో వస్తు మార్పిడి పద్ధతి ద్వారా వ్యాపారం చేసేవారని పేర్కొన్నారు. ఆధునిక యుగంలోనూ సమాఖ్యల అవసరం చాలా ఉందని వెల్లడించారు. ఈరోజు (బుధవారం) హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

**మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నాం..**

2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని క్యూర్ - (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)గా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఇక్కడ ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు ...

# దీనికి బాధ్యులెవరు?

పోలీసుల దాడుల్లో ఓ విద్యార్థిని వినికిడి శక్తి కోల్పోయింది

## నిరసనల్లో దాడులకు సాక్ష్యాలు సేకరించాలన్న రాహుల్



- విద్యార్థులపై పోలీసుల దాడులు.. రాహుల్ గాంధీ ఆగ్రహం
- విద్యార్థినికి వినికిడి లోపం.. పోలీసులపై తీవ్ర ఆరోపణలు
- నిరసనకారులపై దాడులంటూ రాహుల్ గాంధీ మండిపాటు
- విద్యార్థుల ఆందోళనపై పోలీసుల తీరును ఖండించిన రాహుల్
- సీఈసీ రాజీనామా డిమాండ్.. నిరసనకారులపై దాడుల కలకలం
- పోలీసుల దాడుల్లో విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయని ఆరోపణ

03

ఢిల్లీ యూనివర్శిటీలో విద్యాభ్యాసం చేస్తున్న కేరళకు చెందిన అధిరా అనే విద్యార్థిని.. పోలీసుల దాడిలో వినికిడి శక్తి కోల్పోయిందంటూ మండిపడ్డారు. ఈ అమ్మాయికి జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని రాహుల్ నిలదీశారు. గత నిరసనల్లో ఒక అబ్బాయి కళ్లు కోల్పోతే.. ఈ సారి ఓ అమ్మాయి వినికిడి శక్తి కోల్పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## రైల్వే ఉద్యోగులకు దసరా బొనాంజా..

- 11.40 లక్షల మంది సిబ్బందికి బోనస్ కానుక
- రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనంతో బోనస్
- ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951
- బోనస్ కోసం రూ.2,009 కోట్ల కేటాయింపు
- దసరా వేళ రైల్వే సిబ్బందికి తీపి కబురు
- గతేడాదితో పోలిస్తే పెరిగిన బోనస్ వ్యయం

02





## అమెరికా నుంచి సీజేపీకి నిధులు..!

**అమెరికన్ సింగర్ సంచలన ఆరోపణలు..**

- సీజేపీపై మేరీ మిల్‌బెన్ సంచలన ఆరోపణలు
- మోదీకి మద్దతుగా అమెరికా సింగర్
- ఢిల్లీ నిరసనలపై విదేశీ కుట్ర ఆరోపణలు
- సీజేపీ ఆందోళనలపై అమెరికా సింగర్ కామెంట్స్
- సీజేపీకి అమెరికా దాతల నిధులంటూ ఆరోపణలు
- ఓటర్ల జాబితా వివాదంపై కొత్త ఆరోపణలు

02



## బతుకమ్మ నాటికి ఇళ్ల అప్పగింత

**తొలి విడతలో 4.50 లక్షల ఇళ్ల మంజూరు**

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ వివక్షకు తావులేదు

- అర్హులైన పేదలందరికీ ఇళ్లు: మంత్రి పొంగులేటి
- బతుకమ్మ నాటికి ఇందిరమ్మ టవర్స్ అప్పగింత లక్ష్యం
- పారదర్శక డ్రా ద్వారా ఫ్లాట్ల కేటాయింపు
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత రిజిస్ట్రేషన్
- పేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం
- రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లు
- పార్టీలు చూడం.. అర్హతే ప్రామాణికం: పొంగులేటి
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి చర్యలు

03

నియోజకవర్గాలవారీగా ఇందిరమ్మ టవర్స్ పనులు

## షాపింగ్, జాబ్స్, లాటరీ పేరుతో సైబర్ మోసాలు..

నకిలీ లింకులతో ఖాతాలకు ఎసరు

- ఆన్‌లైన్ మోసాల్లో డబ్బు రికవరీ కష్టమే!
- సైబర్ నేరాల బారిన పడుతున్న వినియోగదారులు
- మోసపోయిన 67 శాతం మందికి అందని సొమ్ము
- గిఫ్టులు, లాటరీల పేరుతో కొత్త తరహా మోసాలు
- వాట్సాప్ మెసేజులతో సైబర్ నేరగాళ్ల వల
- ఏఐ, డీప్‌ఫేక్‌లతో పెరుగుతున్న ముప్పు
- ఫిర్యాదులు చేసినా పరిష్కారం కాని కేసులు

02




భారత్‌లో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో షాపింగ్, ఉద్యోగాలు, లాటరీలు, క్యూఆర్ కోడ్‌లు, ఏఐ డీప్‌ఫేక్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఫిర్యాదులు చేసినప్పటికీ బాధితుల్లో 67 శాతం మందికి కోల్పోయిన డబ్బు తిరిగి అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వాట్సాప్ మెసేజులు, సోషల్ మీడియా లింకులు, నకిలీ వెబ్‌సైట్ల ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు, డబ్బులు పంపే ముందు వివరాలను ధ్రువీకరించుకోవడం అత్యవసరం.

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

**నీటిని ఒడిసిపట్టడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం**

**ఏపీలో నీళ్లు.. తెలంగాణలో పంట విరామమా?**



- పాలమూరులో వలసలకు కాంగ్రెస్ వైఫల్యమే కారణం
- కేసీఆర్ పాలనతో పోలిస్తే రాష్ట్రంలో పరిస్థితులు దారుణం
- పాలమూరు రైతుల కష్టాలకు రేవంత్ సర్కారే కారణమని ఆరోపణ
- లో ఓల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయంటూ ఆందోళన
- ఎల్‌నినో సాకుతో వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటున్నారని విమర్శ
- సాగునీరు అందక ఎండుతున్న పంటలు..
- సొంత జిల్లాకే న్యాయం చేయలేని సీఎం రేవంత్

02



## జల వివాదాలకు తావివ్వొద్దు

- పాలమూరు-రంగారెడ్డి పనులు వేగవంతం చేయాలి
- రెండు జిల్లాల నేతలతో సీఎం సమావేశం కోరిన గుత్తా
- డిండి ప్రాజెక్టుపై సమీక్షకు విజ్ఞప్తి
- ప్రాజెక్టుల వేగవంతంపై గుత్తా సూచనలు

02

## సిగరెట్టు.. నకిలీ పొగబెట్టు..!

- ఉమ్మడి మెదక్ జిల్లాలో నకిలీ సిగరెట్ల దందా
- తక్కువ ధర.. అధిక లాభం.. నకిలీ సిగరెట్ల వ్యాపారం
- యువత ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నకిలీ సిగరెట్లు
- బ్రాండెడ్ పేర్లతో నకిలీ సిగరెట్ల విక్రయాలు
- అధిక లాభాల కోసం నకిలీ సిగరెట్ల అమ్మకాలు
- క్యాన్సర్ ముప్పు పెంచుతున్న నకిలీ సిగరెట్లు

02



# 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ - 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారని.. ఇందుకు రాష్ట్రాల సహకారం అవసరమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని.. అభివృద్ధి విషయంలో కాదని స్పష్టం చేశారు. 2047 నాటికి స్వతంత్ర భారతం వందేళ్లు పూర్తి చేసుకోబోతుందని తెలిపారు. సమాఖ్య అనే పదానికి చాలా బలం ఉందని చెప్పుకొచ్చారు. పురాతన కాలంలో వస్తు మార్పిడి పద్ధతి ద్వారా వ్యాపారం చేసేవారని పేర్కొన్నారు. ఆధునిక యుగంలోనూ సమాఖ్యల అవసరం చాలా ఉందని వెల్లడించారు. ఈరోజు (బుధవారం) హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

**మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నాం..**

2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని క్యూర్ -- (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)గా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఇక్కడ ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని ప్యూర్ (పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ)గా అభివృద్ధి చేసుకుంటున్నామని వివరించారు. ఈ ప్రాంతంలో తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ రంగాలను ప్రోత్సహిస్తామని అన్నారు. మిగిలిన గ్రామీణ ప్రాంతాలను రేర్ (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ)గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకొచ్చారు.

**తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం..**

ఇక్కడ వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయాధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధికి ప్రాధాన్యం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్నదే తమ సంకల్పమని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ 5 శాతం కంట్రిబ్యూట్ చేస్తోందని అన్నారు. దీన్ని 10 శాతానికి చేర్చాలనే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని వివరించారు. నాలుగు వందల ఏళ్ల క్రితమే దేశ, విదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలకు చార్మినార్ ల్యాండ్ మార్క్‌గా మారిందని ఉద్ఘాటించారు. చార్మినార్ తర్వాత బిజినెస్‌కు ల్యాండ్ మార్క్.. హైటెక్ సిటీ అని చెప్పుకొచ్చారు. నూతన పారిశ్రామిక విధానంలో మీరంతా భాగసామ్యులు కావాలని సూచించారు. ఇప్పటి వరకు మనవాళ్లు కేవలం కార్పొరేట్ కంపెనీలకు సర్వీస్ చేసే వైపు మాత్రమే ఉన్నారని వెల్లడించారు. మన ప్రాంతానికి చెందిన వాళ్లు పెట్టుబడులు పెట్టి గ్లోబల్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

**మహిళల భాగస్వామ్యం ఉన్న దేశాలే ఆర్థికంగా బలపడ్డాయి..**

ఒకసారి మనం ప్రపంచాన్ని గమనిస్తే.. మహిళల భాగస్వామ్యం ఉన్న దేశాలే ఆర్థికంగా బలపడ్డాయని ముఖ్యమంత్రి తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణలో మహిళలకు రూ. 61 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని చెప్పారు. ఆర్టీసీ బస్సులకు, పెట్రోల్ బంకులకు, సోలార్ ప్లాంట్స్‌కు మహిళలను యజమానులను చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సీఎం ఓ సూచన చేశారు. యువతతో పాటు మహిళలను ప్రోత్సహించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం వైపు నుంచి కావాల్సిన సహకారం అందిస్తామని తెలిపారు. మంచి విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని వెల్లడించారు. 'మీ పెట్టుబడులకు మా భరోసా' ఉంటుందని భరోసా కల్పించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా ముందుకెళ్దామని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమాఖ్య సమ్మిట్‌కు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామ కృష్ణమ రాజు, ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు, దానం నాగేందర్, మున్నూరు కాపు ఫౌండేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జస్టిస్ భవానీ ప్రసాద్, కరీంనగర్ గ్రంథాలయ ఛైర్మన్ సత్తు మల్లేశ్, తదితరులు హాజరయ్యారు. ఇవాళ, రేపు రెండు రోజులపాటు సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఎస్‌సీసీ) ఆధ్వర్యంలో హైటెక్స్‌లో సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026 జరగనుంది.

## రైతన్నకు భారీ ఊరట..

**మహారాష్ట్ర :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వ సహాయం కోసం వేచి చూడకుండా అన్నదాతలకు తక్షణ ఊరట కల్పించాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతి రైతుకు రూ.5,000 చొప్పున తక్షణ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఈ మొత్తాన్ని ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా దీపావళి పండుగ కంటే ముందే రైతుల బ్యాంకు ఖాతాల్లో డీబీటీ ద్వారా జమ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. సెప్టెంబర్ నెలలోనే స్వయంగా కరువు ప్రభావిత జిల్లాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించిన ముఖ్యమంత్రి, రైతన్నలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఈ సహాయక ప్యాకేజీని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 36 జిల్లాలకు గాను సుమారు 34 జిల్లాల పరిధిలోని 305 తాలూకాలను ప్రభుత్వం ఇప్పటికే కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించింది. ఇది రాష్ట్ర మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో దాదాపు 75 శాతం కావడం గమనార్హం. మరాఠ్వాడా, విదర్భ, ఉత్తర మహారాష్ట్ర, పూణె రెవెన్యూ డివిజన్లలో వర్షాభావం తీవ్రంగా ఉండగా.. ముఖ్యంగా సోలాపూర్ జిల్లాలో సాధారణ వర్షపాతంలో కేవలం 48 శాతమే నమోదు కావడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సాయం తో పాటు పంట రుణాల రికవరీని తాత్కాలికంగా పూర్తిగా నిలిపివేయడం, విద్యుత్ బిల్లుల్లో రాయితీలు, తాగు-సాగు నీటి సౌకర్యాల కల్పన మరియు రైతు కుటుంబాల్లోని విద్యార్థుల పాఠశాల ఫీజుల మాఫీ వంటి పలు సమగ్ర ఉపశమన చర్యలను సైతం ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తోంది.

# షాపింగ్, జాబ్స్, లాటరీ పేరుతో సైబర్ మోసాలు..

**ఢిల్లీ :** భారత్‌లో ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్, ఉద్యోగాల పేరుతోనే కాకుండా గిఫ్ట్స్, లాటరీలు గెలుచుకున్నారంటూ చెప్పి కూడా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారు. అయితే, మోసానికి గురైన వారు ఫిర్యాదులు చేస్తున్న, పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందడం మాత్రం కష్టంగానే మారుతోంది. తాజాగా విడుదలైన జీఏస్‌ఎంఏ 'ఇండియా కన్స్యూమర్ స్కామ్ రిపోర్ట్ 2026'లో ఈ విషయం వెల్లడైంది. ఈ నివేదిక ప్రకారం, మోసానికి గురై డబ్బులు కోల్పోయిన వారిలో 67% మందికి డబ్బు తిరిగి రాలేదు. అంతేకాదు, ఫిర్యాదు చేసిన కేసుల్లో 33% ఇంకా పరిష్కారం కాలేదు. మోసానికి గురైన వారిలో 86% మంది సహాయం కోసం కనీసం ఒక సంస్థనైనా సంప్రదించిన, ఆశించిన ఫలితం అందరికీ దక్కడం లేదు.

**2026లో ఆన్‌లైన్ మోసాల పరిస్థితి ఏంటి?**

ఈ నివేదికను మిల్వ్యూ ఇన్‌సైట్ సంస్థ 2026 జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహించిన ఆన్‌లైన్ సర్వే ఆధారంగా రూపొందించారు. ఇందులో పాల్గొన్న భారతీయ వినియోగదారుల్లో 12% మంది గత 12 నెలల్లో నేరుగా మోసానికి గురైనట్లు చెప్పారు. మరో 39% మంది మోసపోకపోయినా, తమకు తెలిసినవారు ఇలాంటి మోసాల బారిన పడినట్లు వెల్లడించారు. దీన్ని బట్టి ఆన్‌లైన్ మోసాలు వ్యక్తిగత సమస్యగానే కాకుండా, చాలామంది ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యగా మారుతున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదు చేసిన తర్వాత కూడా డబ్బు తిరిగి రాకపోవడం బాధితులకు మరింత ఇబ్బందిగా మారుతోంది.

**ఎక్కువగా జరుగుతున్న మోసాలు ఇవే!**

భారతీయ వినియోగదారులు ఎదుర్కొంటున్న మోసాల్లో ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు మొదటి స్థానంలో ఉన్నాయి. సర్వేలో వెల్లడైన వివరాల ప్రకారం.. ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు 33%, గిఫ్ట్స్, లాటరీలు, వారసత్వం పేరుతో మోసాలు 31%, ఉద్యోగాలు, లాభాలు వస్తాయంటూ చేసే మోసాలు 30%, క్యూఆర్ కోడ్‌లు, పేమెంట్ లింకుల ద్వారా మోసాలు 27%. ఆన్‌లైన్‌లో వస్తువులు ఆర్డర్ చేసినా అవి రాకపోవడం, నకిలీ వెబ్‌సైట్ల ద్వారా డబ్బులు వసూలు చేయడం, ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ముందుగానే డబ్బులు అడగడం వంటి పద్ధతులతో మోసాలు జరిగే అవకాశం ఉంది. లాటరీ గెలిచారంటూ ఫోన్ చేసి, గిఫ్ట్ పొందాలంటే ముందుగా డబ్బులు చెల్లించాలని చెప్పడం కూడా మోసగాళ్లు ఉపయోగించే పద్ధతుల్లో ఒకటి.

**వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా**

సైబర్ నేరగాళ్లు ప్రజలను సంప్రదించడానికి ఎక్కువగా మెసేజింగ్ యాప్స్ ఉపయోగిస్తున్నట్లు నివేదికలో వెల్లడైంది. వీటిలో మెసేజింగ్ యాప్‌లు 42%, సోషల్ మీడియా 37%, ఈమెయిల్ 33%.... తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజులు, అనుమానాస్పద లింకులు, ఆకర్షణీయమైన ఆఫర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా డబ్బులు గెలుచుకున్నారని లేదా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్పే మెసేజులను వెంటనే నమ్మకూడదు.

**ఏఐతో మోసాలు..**

ఇప్పుడు సైబర్ నేరగాళ్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నట్లు నివేదిక చెబుతోంది. సర్వేలో పాల్గొన్న భారతీయ వినియోగదారుల్లో 89% మంది మోసాల్లో ఏఐ వినియోగాన్ని గమనించినట్లు తెలిపారు. వారిలో 48% మంది ఏఐతో క్రియేట్ చేసిన మెసేజులు లేదా నకిలీ ఫోటోలు గుర్తించగా, 42% మంది నిజమైన వ్యక్తుల్లా కనిపించే డీప్‌ఫేక్ వీడియోలను చూసినట్లు చెప్పారు. దీంతో కేవలం మెసేజ్ లేదా వీడియో చూసి అది నిజమని నమ్మడం ప్రమాదకరంగా మారుతోంది. తెలిసిన వ్యక్తి గొంతుతో ఫోన్ చేసినా, వీడియో పంపినా, డబ్బులు పంపే ముందుగా నిజమో కాదో కన్ఫర్మ్ చేసుకోవడం మంచిది.

**మోసపోతే ఎవరిని సంప్రదిస్తున్నారు?**

మోసానికి గురైన భారతీయుల్లో చాలామంది పోలీసులను, బ్యాంకులను ఆశ్రయిస్తున్నట్లు సర్వే వెల్లడించింది. ఇందులో 49% మంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. 41% మంది బ్యాంకు లేదా ఈ-వాలెట్ సంస్థను సంప్రదించారు. 40% మంది మోసం జరిగిన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌కు ఫిర్యాదు చేశారు. 36% మంది మొబైల్ లేదా ఇంటర్నెట్ సేవల సంస్థలను సంప్రదించారు. అయితే, ఫిర్యాదు చేయడం మాత్రమే సమస్యకు పరిష్కారం కావడం లేదు. ఒక సంస్థ కేసు పరిష్కారానికి బాధ్యత తీసుకున్న, డబ్బు తిరిగి వస్తుందని లేదా కేసు పరిష్కారమవుతుందని కాదు. భారత్‌లో ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు ఫిర్యాదు చేస్తున్న.. పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందడంలో ఇంకా చాలా సమస్యలు ఉన్నాయని ఈ రిపోర్ట్ సూచిస్తోంది. ముఖ్యంగా షాపింగ్, ఉద్యోగాలు, లాటరీలు, ఏఐ ద్వారా మోసాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తుంది. తెలియని లింకులను క్లిక్ చేయకుండా, ప్రతి పేమెంట్ ఒకటికి రెండుసార్లు కన్ఫర్మ్ చేసుకుంటే ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉంటుంది.

# అమెరికా నుంచి సీజేపీకి నిధులు..!

**ఢిల్లీ :** ఢిల్లీ ఆందోళనలు, కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల నేపథ్యంలో ప్రముఖ అమెరికా సింగర్ మేరీ మిల్‌బెన్ సంచలన ఆరోపణలు చేశారు. సీజేపీకి అమెరికా నుంచి "ఎంపిక చేసిన దాతలు" నిధులు సమకూర్చుకుతున్నారని ఆమె ఆరోపించారు. ఎక్స్ వేదికగా ఆమె ప్రధాన నరేంద్రమోడీకి మద్దతుగా, సీజేపీకి వ్యతిరేకంగా పోస్ట్ చేశారు. ఎన్నికల జాబితాలో అక్రమాలు జరిగాయని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ద్వారా కోట్ల సంఖ్యలో ఓటర్లను తొలగిస్తున్నారని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ సీజేపీ, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు నిరసనలు చేపడుతున్నాయి. ఈ నిరసనల వెనక విదేశీ శక్తుల కుట్ర ఉందని ఆమె ఆరోపించారు. ఎక్స్‌లో పోస్ట్ మేరీ మిల్‌బెన్.. " సంప్రదాయవాద ప్రపంచ నాయకులను లక్ష్యంగా చేసుకోవడం, ఆ దేశానికి చెందిన అమెరికాలో చదువుకున్న వ్యక్తిని గుర్తించడం, అతడిని తీవ్రవాద ధోరణుల వైపు మళ్లించడం, తిరిగి స్వదేశానికి పంపించి గందరగోళం, విధ్వంసం సృష్టించేందుకు నిధులు సమకూర్చడం" ఈ విధానంలో భాగమని ఆమె ఆరోపించారు. అమెరికాకు చెందిన దాతలు ఈ కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తున్నారని అన్నారు. అయితే, ఇలాంటి చాలా ప్రయత్నాలు విఫలయమ్యాయని, అయినప్పటికీ ఆయా దేశాల అభివృద్ధి, పాలనపై తీవ్ర ప్రభావం



చూపుతాయని ఆమె అన్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే పేరు నేరుగా తీసుకోకుండా పరోక్షంగా ఆమె వ్యాఖ్యానించారు. దీప్కే అమెరికా బోస్టన్ యూనివర్సిటీలో చదువుకున్నట్లు చెప్పుకుంటున్నాడు. బీజేపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో గుర్తింపు సంపాదించాడు. ఇదే సమయంలో మేరీ మిల్‌బెన్ ప్రధాని నరేంద్రమోడీకి మద్దతు ప్రకటించారు. భారతదేశ పాలనను దెబ్బతీసేందుకు విదేశీ శక్తులు చేసే ప్రయత్నాలను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు మౌనంగా ఉండాల్సిన సమయం కాదని, యువత దేశ ప్రయోజనాల కోసం ముందుకు రావాలని కోరారు.

# సిగరెట్టు.. నకిలీ పొగబెట్టు..!

**కోహెడ(మెదక్),ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా నకిలీ సిగరెట్ల దందా జోరుగా సాగుతోంది. జిల్లా కేంద్రంతో పాటు హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, అక్కన్నపేట మండల కేంద్రాల్లోనూ, మారుమూల గ్రామాల్లోని కిరాణా, పాన్‌షాపుల్లో ఈ నకిలీ సిగరెట్ల వ్యాపారం విస్తరించింది. ఎలాంటి బిల్లులు, రసీదులు లేకుండా విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు లభిస్తుండటంతో యువత, కూలీలు వీటిని కొనుగోలు చేసి తాగుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్యాకెట్ల ప్రింటింగ్‌లో తేడాలను గమనిస్తే ఈ నకిలీ దందా ఏ స్థాయిలో సాగుతుందో అర్థమవుతోంది. డబ్బాపై ఉండే ప్రింటింగ్, బ్యాచ్ నంబర్, హెచ్చరిక బొమ్మల స్పష్టతలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బ్రాండెడ్ కంపెనీల పేర్లతో పోలిన నకిలీ డబ్బాలను తక్కువ ధరకు మార్కెట్లోకి తెస్తున్నారు. అసలు డబ్బా ధర రూ200 దాటి ఉంటే, నకిలీ డబ్బాను చాలా తక్కువ ధరకు సరఫరా చేస్తున్నారు.

**ఆశ చూపించే లాభాలు!**

అసలు సిగరెట్ డబ్బా అమ్మితే వ్యాపారులకు రూ.10నుంచి రూ.15 మాత్రమే లాభం వస్తుంది. అదే నకిలీ డబ్బా విక్రయిస్తే ఏకంగా రూ.60 నుంచి రూ.80 వరకు మార్జిన్ లభిస్తోంది. దీంతో వ్యాపారులు ఎక్కువ లాభాల కోసం నకిలీ సిగరెట్లనే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా స్థానిక యువత, కార్మికులు ఈ ప్రమాదకర అలవాటుకు బానిసలవుతున్నారు.

**నకిలీతో క్యాన్సర్ ముప్పు మరింత ఎక్కువ**

నకిలీ సిగరెట్లు యువత ప్రాణాలకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయి. స్టైల్ కోసమో, స్నేహితుల ఒత్తిడి వల్లో వీటిని తాగుతున్నప్పటికీ, సహజమైన పొగాకుకు బదులుగా హానికర రసాయనాలు కలిపిన పొగాకును వాడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీనివల్ల ఊపిరితిత్తుల జబ్బులు, నోటి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వేగంగా సంభవించే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

**నిమ్మకు నీరెత్తిన అధికారులు**

జిల్లాలో నకిలీ సిగరెట్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నా, ఎక్సైజ్, పోలీసు శాఖల తనిఖీలు లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించాలని, నకిలీ సిగరెట్ల సరఫరా ముఠాలను, తయారీదారులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైల్వే ఉద్యోగులకు దసరా బొనాంజా..

**ఢిల్లీ :** ప్రతి సంవత్సరం దుర్గాపూజ, దసరా పండుగల వేళ రైల్వే ఉద్యోగులు ఆత్రుతగా ఎదురుచూసే శుభవార్త రానే వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 11.40 లక్షల మంది రైల్వే సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం భారీ తీపి కబురు అందించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్.. అర్హులైన రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనంతో సమానమైన బోనస్‌ను ఆమోదించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.2,009.61 కోట్లు విడుదల చేయనుంది. ఈ పండుగ బోనస్ ద్వారా మొత్తం 11,40,770 మంది నాన్-గెజిటెడ్ రైల్వే ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. అర్హత కలిగిన ప్రతి ఉద్యోగికి గరిష్టంగా రూ. 17,951 బోనస్ రూపంలో అందనుంది.

**ఎవరెవరికి ఈ బోనస్ వర్తిస్తుంది?**

రైల్వే శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 'గ్రూప్ సీ' సిబ్బందికి ఈ బోనస్ లభిస్తుంది. ట్రాక్ మెయింటెనెర్లు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు (గార్డులు), స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్స్‌మెన్, మినిస్టీరియల్ సిబ్బంది, ఇతర గ్రూప్ 'సీ' ఉద్యోగులు ఈ బోనస్ పొందనున్నారు. రైల్వే సిబ్బంది కనబరిచిన అద్భుత పనితీరుకు గుర్తింపుగా ఈ బోనస్‌ను ఆమోదించినట్లు కేంద్ర కేబినెట్ తెలిపింది. ఈ ప్రోత్సాహకం రాబోయే రోజుల్లో రైల్వే సేవలను మరింత మెరుగుపరిచేందుకు ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారతీయ రైల్వే రికార్డు స్థాయి ప్రదర్శన నమోదు చేసింది. ఏకంగా 1,670 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు, దాదాపు 7.41 బిలియన్ల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చింది.

**గత సంవత్సరంతో పోలిస్తే..**

గత ఏడాది (2025 సెప్టెంబర్ 24న) కూడా కేంద్ర కేబినెట్ 10,91,146 మంది ఉద్యోగులకు రూ. 1,865.68 కోట్ల వ్యయంతో 78 రోజుల బోనస్‌ను మంజూరు చేసింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి ప్రభుత్వం వెచ్చించే బోనస్ మొత్తం రూ. 143.93 కోట్లు పెరిగింది (సుమారు 7.7 శాతం పెరుగుదల). అంతేకాకుండా.. ఈ ఏడాది అదనంగా 49,600 మంది ఉద్యోగులు (దాదాపు 4.5 శాతం అధికం) లబ్ధి పొందనున్నారు. అయితే.. 78 రోజుల పరిమితితో పాటు ప్రతి ఉద్యోగికి చెల్లించే గరిష్ట పరిమితి (రూ. 17,951) గత ఏడాదితో పోలిస్తే ఎలాంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగింది.

# జల వివాదాలకు తావివ్వొద్దు

**నల్గొండ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో జిల్లాల మధ్య జలవివాదాలకు తావివ్వకుండా సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని కోరారు. బుధవారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఎదుల్ల రిజర్వాయర్ నీటి కేటాయింపుల అంశాన్ని వివాదాస్పదం చేయకుండా మహబూబ్నగర్, నల్గొండ జిల్లాల ప్రజాప్రతినిధులు పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమస్య పై సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని రెండు జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశం నిర్వహించాలని కోరారు. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులు రబీ సీజన్లో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. నీరు, విద్యుత్తు పొదుపుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# భార్య, ప్రియుడికి మరణశిక్ష

## మీరట్ బ్లూ డ్రమ్ కేసులో సంచలన తీర్పు..

**మీరట్ :** మీరట్‌లో జరిగిన బ్లూ డ్రమ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గతేడాది మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాలకు జిల్లా కోర్టు మరణశిక్ష విధించింది. 126 విచారణలు, 22 మంది సాక్షుల వాంగ్మూలాల తర్వాత జిల్లా జడ్జి జస్టిస్ అరవింద్ కుమార్ మిశ్రా ఈ సంచలన తీర్పు ఇచ్చారు. రస్తోగి, ఆమె ప్రియుడు శుక్లా.. రాజ్‌పుత్‌ను హత్య చేయడానికి కుట్ర పన్ని, అతని శరీర భాగాలను కాంక్రీటు, ఇసుక ఉపయోగించి ఒక నీలిరంగు డ్రమ్‌లో దాచిపెట్టారని విచారణలో రుజువైనట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇలాంటి నేరాలు సమాజంలో తీవ్ర భయాన్ని సృష్టిస్తాయని వ్యాఖ్యానించారు. సౌరభ్ రాజ్‌పుత్ చాలా మంచి వ్యక్తి అని, దోషులకు మరణశిక్ష విధిస్తే తాము నిరసన తెలపబోమని ముస్కాన్ రస్తోగి తల్లిదండ్రులు కోర్టుకు తెలిపారు. రస్తోగిని కలిసేందుకు ఆమె కుటుంబ సభ్యులు ఎప్పుడూ జైలుకు వెళ్లలేదు. పోలీసుల నివేదిక ప్రకారం.. 2025 మార్చి 3న ముస్కాన్ రస్తోగి మందుస్తు ప్లాన్ ప్రకారం భర్త సౌరభ్ రాజ్‌పుత్‌కు ఆహారంలో మత్తుమందు కలిపి ఇచ్చింది. ఆ తర్వాత ప్రియుడు సాహిల్ శుక్లాతో కలిసి అతన్ని కత్తితో పొడిచి చంపేశారు. దుర్వాసన రాకుండా ఉండటానికి మృతదేహాన్ని బాత్రూమ్‌లో ముక్కలుగా నరికి, ఒక పెద్ద నీలిరంగు ప్లాస్టిక్ డ్రమ్‌లో కుక్కారు. ఆపై ఇసుక, సిమెంట్ కలిపి డ్రమ్‌లో పోసి సీలు చేశారు. హత్య తర్వాత వారు హిమాచల్ ప్రదేశ్‌కు పారిపోయారు. సౌరభ్ బతికే ఉన్నట్లు నమ్మించడానికి అతడి ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు సందేశాలు పంపారు. అనుమానం వచ్చిన బంధువులు పోలీసులతో కలిసి మార్చి 17న ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా, డ్రమ్‌లో శవం కనిపించింది. రెండు రోజుల తర్వాత పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. 13 నెలల తరువాత, 126 విచారణలు, 22 మంది సాక్ష్యాలను పరిశీలించిన జిల్లా కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ మిశ్రా దోషులకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# దేశంలో ఎస్ఐఆర్‌పై ఒవైసీ సవాల్..




**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా :** నల్లగొండ జిల్లాలో సాగు నీరు అందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. కొందరు అధికారులు పాలకులపై ఒత్తిడి తీసుకువచ్చి జిల్లాకు నీళ్లు రాకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈరోజు (బుధవారం) నల్లగొండలో మీడియాతో గుత్తా సుఖేందర్ రెడ్డి చిట్‌చాట్ చేశారు.

**నీళ్లన్నీ పాలమూరుకే కావాలని అనడం సరికాదు..**

నీళ్లన్నీ పాలమూరుకే కావాలని అనడం సరికాదని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. డిండికి నీళ్లు కేటాయించవద్దని అనడం ఏంటి? అని ప్రశ్నించారు. నల్లగొండకు నీళ్లు ఎలా ఇస్తారని సీఎంపై అధికారులు ఒత్తిడి తేవడం ఏంటి? అని ప్రశ్నించారు. ఎవరి మాటలో విని సీఎం, ఇంకొకరు కాని నిర్ణయం తీసుకోవడం సరికాదని అన్నారు. నల్లగొండ జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతోందని తెలిపారు. పాలమూరులో 25 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లు ప్రారంభం అయ్యాయని.. కానీ ఎక్కడి నుంచి నీళ్లు తీసుకుంటారో సరైన ప్లాన్ లేదని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# కాంగ్రెస్ భారీ బహిరంగ సభ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదికగా జాతీయ స్థాయిలో బలప్రదర్శనకు కాంగ్రెస్ అధిష్ఠానం రంగం సిద్ధం చేస్తోంది. ఈ నెల 24వ తేదీన విపక్ష 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో నగరంలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ బహిరంగ సభను నిర్వహించాలని కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. రాబోయే రాజకీయ సమీకరణాలు, ప్రజా సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టడమే లక్ష్యంగా సుమారు లక్ష మంది జనసమీకరణతో ఈ భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) నేతలు పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు. సభా వేదిక ఎంపిక, రవాణా, భద్రతా ఏర్పాట్లపై ఇప్పటికే పీసీసీ ముఖ్య నేతలు, మంత్రులు ప్రత్యేక కమిటీలుగా ఏర్పడి సమన్వయం చేసుకుంటున్నారు. ఈ ప్రతిష్టాత్మక బహిరంగ సభకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తో పాటు ఇండియా కూటమిలోని జాతీయ స్థాయి అగ్రనేతలు, ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా విపక్షాలను ఏకతాటి పైకి తెస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ నినాదంతో సాగుతున్న పోరాటంలో భాగంగా హైదరాబాద్ సభను

అత్యంత కీలక మైలురాయి గా మలచాలని కూటమి నేతలు భావిస్తున్నారు. ఈ సభ ద్వారా అటు జాతీయ స్థాయి రాజకీయాలతో పాటు ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపేలా అగ్రనేతల ప్రసంగాలు ఉండనున్నాయి.

# మాజీ సీఎం వైఎస్ జగన్‌పై కేసులు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కి సంబంధించిన సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుల్లో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇకపై ఈ కేసులను రోజువారీగా విచారించాలని హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రత్యేక సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ విచారణలో భాగంగా వైఎస్ జగన్‌తో పాటు నిందితులందరిని వ్యక్తిగతంగా విచారించనున్నారు. అయితే, దశాబ్ద కాలంగా ఈ కేసులు డిశ్చార్జ్ పిటిషన్ల దశలోనే పెండింగ్‌లో ఉండటంతో, విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇటీవల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన సత్వర విచారణ హక్కు ప్రకారం, ఈ కేసులను రోజువారీ ప్రాతిపదికన విచారించాలని ఈడీ తన పిటిషన్‌లో గట్టిగా వాదించింది. లోతైన కుట్రలు, భారీగా ప్రజాధనం లూటీ వంటి ఆర్థిక నేరాలకు సంబంధించిన ఈ కేసులను తీవ్రంగా పరిగణించాలని సుప్రీంకోర్టు కూడా గతంలో స్పష్టం చేసినట్లుగా ఈడీ తన వాదనల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలోనే నాంపల్లి ప్రత్యేక సీబీఐ కోర్టు ఈ కేసుల విచారణను వేగవంతం చేస్తూ, జగన్‌తో పాటు సంబంధిత నిందితులందరూ విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యేలా చర్యలు తీసుకోనుంది.

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

**మహబూబ్ నగర్,ఫ్లాష్ ఇండియా :** మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు తన్నీరు హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితి కాలం తెచ్చిన కరువు కాదని, కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల వచ్చిన కర–ువేనని విమర్శించారు. పాత రోజులు మళ్లీ తీసుకువస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ మాటను నిలబెట్టుకుంటూ పాలమూరు జిల్లా నుంచి మళ్లీ వలసలు ప్రారంభమయ్యేలా చేశారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి తన పాలనలో కనీసం సొంత జిల్లాకు కూడా న్యాయం చేయలేకపోయారని ఎద్దేవా చేశారు.

**కరెంట్, నీళ్లు లేక రైతుల అల్లాటల్లాటం**

రాష్ట్రంలో నీళ్లు, కరెంట్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లో ఓల్టేజీ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ హయాంలో ఇలాంటి సమస్యలేవీ లేవని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటలు మోటార్లు నడిపి విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా నిర్వహించాల్సింది పోయి, రోజుకు కేవలం 8 గంటలే మోటార్లు నడుపుతోందని మండిపడ్డారు. కేసీఆర్ పాలనతో పోలిస్తే రేవంత్ రెడ్డి పాలన రాష్ట్రానికి ఒక గ్రహణంలా మారిందని విమర్శించారు.

**ఆంధ్రప్రదేశ్‌లో నీళ్లు.. ఇక్కడ క్రాప్ హాలిడేనా?**

పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులను ఉదాహరణగా చూపుతూ.. అక్కడ చంద్రబాబు నాయుడు కృష్ణానది నీటిని 700 కిలోమీటర్లు తీసుకెళ్లి కుప్పంలో పారించుకుంటున్నారని, అలాగే వెలిగొండ ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు నీళ్లు పార–ుతున్నాయని హరీష్ రావు తెలిపారు. మన రాష్ట్రం నుంచే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు పోవాల్సి ఉన్నప్పుడు, నీళ్లు ఉన్న అక్కడ లేని క్రాప్ హాలిడే మన రాష్ట్రంలో ఎందుకు వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమ–ర్థవంతంగా నీటిని ఒడిసిపట్టకుండా వదిలేయడం వల్లే రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయని హరీష్ రావు ఆరోపించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ నాయకులు ఎల్ నినో, కరువు అంటూ రకరకాల పేర్లు చెబుతూ ప్రజలను మరింత భయాందోళనలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏర్పడిన ఈ పరిస్థితికి పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనమే కారణమని దుయ్యబట్టారు.

# బతుకమ్మ నాటికి ఇళ్ల అప్పగింత

**ఘట్కేసర్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంత ఇంటి కల సాకారం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్కేసర్ సర్కిల్ పోచారం డివిజన్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ముందుగా ఇందిరమ్మ టవర్స్ లో లబ్ధిదారులకు దసరా, బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సీఎంగా రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత పేదవాడి సొంత ఇంటి కల సాకారం చేయాలని దృఢ సంకల్పం చేసుకున్నట్లు తెలిపారు. రూ.100- 275 కోట్లు విలువ చేసే ప్రదేశంలో క్యూర్ పరిధిలో మొదట విడతగా లక్ష ఇండ్ల నిర్మించేందు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే 23 నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించారు. క్యూర్ పరిధిలో లక్ష మందికి సొంత ఇంటి కల సాకారం చేయాలని ఐదు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం కోసం శంకుస్థాపనలు జరిగాయని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక నిష్పక్షపాతంగా పారదర్శకంగా జరుగుతుంది.... మేడ్చల్ నియోజకవర్గంలో దాదాపు రూ.43 కోట్ల వ్యయంతో 480 మంది పేదలకు పోచారంలో ఇందిరమ్మ టవర్స్ కు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందిరమ్మ టవర్స్‌ ప్లాట్ల కోసం చేసిన దరఖాస్తులను విచారణ జరిపి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేస్తామని చెప్పారు. ముఖ్యంగా స్థానిక నియోజకవర్గానికి చెందిన వారినే ఎంపిక చేస్తామని స్పష్టం చే శారు. అయితే ఇండ్లు ఇచ్చాం కదా అని ఓటివ్వమని అడగమని అన్నారు. ప్రతిపక్ష నేత ఎమ్మెల్యే నియోజకవర్గంలో కూడా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో రెండు మూడు విడతల్లో లబ్ధిదారుల ఎంపిక చే స్తామని, కొత్తగా దరఖాస్తులు చేసుకునే వారికి అవకాశం ఉంటుంద వెల్లడించారు. లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ కూడా ప్రభుత్వం ఉ చితంగా చేయిస్తుందని, ఆ డాక్యుమెంట్ ద్వారా బ్యాంక్ లోన్ తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వాలు నివాస యోగ్యమైన స్థలాల్లో గృహాలు నిర్మించడం వల్ల మౌళిక సదుపాయాలు లేక కష్టాలు పడుతున్నారని, ఆ ప్రాంతాల్లో కూడా అన్ని సహకారాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

**వచ్చే దసరనాటికల్లా ఇండ్లను అందజేస్తాం..**

వచ్చే దసరా నాటికి ఇందిరమ్మ టవర్స్ లో లబ్ధిదారులకు ప్లాట్లు అందజేస్తామని, లబ్ధిదారులు ఇక్కడే దసరా పండుగతో పాటు బతుకమ్మ సంబరాలు జరుపుకునేలా నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆన్లైన్ లో డ్రా పద్ధతిలో ప్లాట్లు కేటాయించబడిన లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామపురం మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ఎండి గౌతమ్, జిల్లా కలెక్టర్ మన చౌదరి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**నియోజకవర్గానికి చెందిన వారినే ఎంపిక చేయాలి : ఎంపీ ఈటల రాజేందర్**

యాకత్పుర, డబిల్పుర లాంటి బయట ప్రాంతాల వారికి ఘట్కేసర్ లో ఇండ్లు ఇస్తే లబ్ధిదారులు కష్టాలు పడతారని, మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన అర్హులైన వారికే టవర్స్ లో అలాంట్మెంట్ చేయాలని ఎంపీ ఈటెల సూచించారు. ఇప్పటికే నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్రూం లలో ఇందు చాలా వరకు ఖాళీగా ఉన్నాయని అర్హులైన పేదలను గుర్తించి వారికి నేరుగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# దీనికి బాధ్యులెవరు?

**ఢిల్లీ :** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ.. నిన్న( మంగళవారం)శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థుల పట్ల ఢిల్లీ పోలీసులు క్రూరంగా వ్యవహరించారంటూ.. రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఈ మేరకు విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన పాల్గొన్నారు. ఢిల్లీ యూనివర్శిటీలో విద్యాభ్యాసం చేస్తున్న కేరళకు చెందిన అథిరా అనే విద్యార్థిని.. పోలీసుల దాడిలో వినికిడి శక్తి కోల్పోయిందంటూ మండిపడ్డారు. ఈ అమ్మాయికి జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని రాహుల్ నిలదీశారు. గత నిర–సనల్లో ఒక అబ్బాయి కళ్లు కోల్పోతే.. ఈ సారి ఓ అమ్మాయి వినికిడి శక్తి కోల్పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నిరసనల్లో దాడికి గురైన విద్యార్థులు.. తమపై జరిగిన అన్యాయాలను మీడియాకు వివరించారు. అథిరా మాట్లాడుతూ.. 'నిన్న శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న నన్ను పోలీసు వాహనంలో స్టేషన్‌కు తరలించారు. అమ్మాయిలను అరెస్ట్ చేసిన సందర్భంలో ఓ లేడీ కానిస్టేబుల్ వెంట ఉండాలి కదా.. అని ప్రశ్నించాను. దీనిపై కోప్పడ్డ పోలీసులు.. ఆపకుండా చెంపదెబ్బలు కొట్టారు. ఈ దాడిలో నా కంటికి, చెవికి తీవ్రగాయాలయ్యాయి. ఒక చెవి వినికిడి శక్తిని కోల్పోయింది' అని ఆవేదన చెందారు. మరో నిరసనకారుడు మాట్లాడుతూ.. 'నన్ను, నా సహోద్యోగిని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి.. 15-20 మంది పోలీసులు అతి దారుణంగా కొట్టారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఢిల్లీ సరిహద్దులకు మమ్మల్ని తరలిస్తున్న సమయంలో.. అంకిత్ కసానా అనే కానిస్టేబుల్ దారిపొడవునా కొడుతూనే ఉన్నాడు' అని తెలిపారు. వాంతులు వస్తున్నాయని పోలీసులను అభ్యర్థించగా.. 'బ్యాగ్‌లో వాంతి చేసుకో' అంటూ నిర్లక్ష్యంగా బదులిచ్చారని ఓ విద్యార్థి వాపోయారు. పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో తమను అమానుషంగా కొట్టారని, ప్రైవేట్ పార్ట్స్‌పై దాడి చేశారని ఓ విద్యార్థి తెలిపారు. ఫోన్లు, వాలెట్లను లాక్కొని.. తిరిగి ఇవ్వకుండానే తమను విడుదల చేశారని మరికొందరు ఆరోపిస్తున్నారు.

**దాడులను రికార్డు చేయండి: రాహుల్ గాంధీ**

'పోలీసుల దాడులను ఫోన్‌లో రికార్డ్ తీయండి. దాడులకు సంబంధించి సాక్ష్యాధారాలు ఉంటే.. న్యాయపరమైన పోరాటం చేసే అవకాశం ఉంటుంది. మన దగ్గర సాక్ష్యాలు ఉంటే.. కానిస్టేబుల్ నుంచి అమిత్ షా, మోదీ వరకు ఎవరినైనా అరెస్ట్ చేయవచ్చు'అని రాహుల్ పేర్కొన్నారు. కాగా.. పోలీసుల దాడులపై మల్లిఖార్జున ఖర్గే స్పందించారు. 'ముందుగా శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేశారు. ఆపై.. జంతర్ మంతర్‌పై నిషేధం విధించడం ద్వారా నిరసన చేసే హక్కునే కాలరాశారు. ఇప్పటికైనా జ్ఞానేష్ కుమార్‌ను కాపాడడం మానుకోండి' అంటూ హితవు పలికారు.

# జడల అశోక్ మృతి కేసులో వీడిన మిస్టరీ



**మహాముత్తారం,ఫ్లాష్ ఇండియా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో కాటారం సర్కిల్ పోలీసులు జడల అశోక్ మృతి కేసును ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కాటారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. యామన్‌పల్లి శివారులోని చెరువు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రత్నం వంశీకృష్ణ, రత్నం రాజు అలియాస్ రాజేందర్, తలారి రాజేందర్‌లను పోలీసులు గుర్తించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా, రత్నం వంశీకృష్ణ, రత్నం రాజు అలియాస్ రాజేందర్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు తలారి రాజేందర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

**అక్రమ విద్యుత్ ఉచ్చులే మృతికి కారణం**

విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నిందితులు అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ తీగల ఉచ్చులు ఏర్పాటు చేసేవారు. యామన్‌పల్లి--నిమ్మగూడెం ప్రధాన రహదారి సమీపంలోని 11 కేవీ విద్యుత్ లైన్ నుంచి ఇనుప బైండింగ్ వైర్లకు విద్యుత్ సరఫరా కలిపి అటవీ ప్రాంతంలో ఉచ్చులు అమర్చేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి యామన్‌పల్లి శివారులోని అటవీ ప్రాంతంలో విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేశారు. అదే సమయంలో పోడు భూమి పనుల కోసం అటువైపు వెళ్లిన అజమ్‌నగర్‌కు చెందిన జడల అశోక్ (32) ప్రమాదవశాత్తు విద్యుత్ ఉచ్చులకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మరుసటి రోజు తెల్లవారుజామున ఉచ్చులను పరిశీలించేందుకు వెళ్లిన నిందితులు అశోక్ మృతదేహాన్ని గుర్తించారు. తమ అక్రమ విద్యుత్ ఉచ్చుల కారణంగానే అశోక్ మృతి చెందిన విషయం బయటపడితే పోలీసులకు పట్టుబడతామనే భయంతో మృతదేహాన్ని అక్కడి నుంచి తొలగించాలని నిర్ణయించుకున్నారు. మృతదేహాన్ని కర్రకు కట్టి మోసుకెళ్లి, సుమారు కిలోమీటరు దూరంలోని వాగు ఒడ్డున ఉన్న పొదల్లో పడేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం పోలీసులకు చిక్కకుండా అడవిలో దాక్కున్న నిందితులు మహారాష్ట్రకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులకు పట్టుబడ్డారు.

**నేరానికి ఉపయోగించిన సామగ్రి స్వాధీనం**

నిందితుల వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన ఇనుప బైండింగ్ వైర్, కాటన్ వైర్, ఒక స్మార్ట్‌ఫోన్, ఒక కీప్యాడ్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

**పోలీసు బృందానికి డీఎస్పీ అభినందనలు**

ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన కాటారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగార్జునరావు, ఎస్ఐలు రమేష్, మహేందర్ కుమార్, శ్రీనివాస్, మహేష్‌తో పాటు పోలీసు సిబ్బంది రాజు, హరీష్, సత్యనారాయణ, లక్ష్మీరాజు, విక్రమ్, హరికుమార్, తిరుపతి, మశుక్, ఐటీ కోర్ వేణులను డీఎస్పీ సూర్యనారాయణ అభినందించారు.

**అక్రమ విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు**

అటవీ జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగల ఉచ్చులు ఏర్పాటు చేయడం అత్యంత ప్రమాదకరమైన, చట్టవిరుద్ధమైన చర్య అని డీఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి ఉచ్చుల వల్ల అటవీ జంతువులతో పాటు మనుషుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఎక్కడైనా అక్రమ విద్యుత్ ఉచ్చులు కనిపించినా, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ఎమ్మెల్యే బాలు నాయక్‌ను కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి

**నల్లగొండ జిల్లా/ చింతపల్లి, దేవరకొండ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పట్టభద్రుల ఓటరు నమోదు పెంపునకు కృషి చేస్తా: ఎమ్మెల్యే బాలు నాయక్ ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్‌ను ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టడంతో పాటు, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పట్టభద్రుల ఓటరు నమోదు పెంపునకు ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో దేవరకొండ నియోజకవర్గంలో విస్తృతంగా నమోదు కార్యక్రమాలు చేపట్టి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు చొరవ చూపాలని, గ్రామాలు, పట్టణాల్లో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికుల మెరుపు సమ్మె




**మహబూబ్ నగర్ జిల్లా/జడ్చర్ల , ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం మెరుపు సమ్మెకు దిగారు. ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ సిబ్బంది విధులు బహిష్కరించి ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. శ్రీశాంతి ఏజెన్సీ కాంట్రాక్టర్ ప్రవీణ్ కార్మికులను సముదాయించే ప్రయత్నం చేసినా, పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు సమ్మె విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అర్షదుల్లా, డాక్టర్ హరినాథ్ కార్మికులతో చర్చలు జరిపి గురువారంలోగా మూడు నెలల వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆగస్టు వరకు వేతన బడ్జెట్ విడుదల చేసినప్పటికీ కార్మికులకు జీతాలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. దసరా పండుగ సమీపిస్తున్నా వేతనాలు అందక కార్మికులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు దుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలన్న ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చొరవ తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే మరోసారి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి ఆందోళనకు మద్దతు తెలిపి, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ద్వారా నేరుగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భాగీ కృష్ణ యాదవ్, ఆసుపత్రి బ్రాంచ్ నాయకులు, కార్మికులు నరసింహ, నాగరాజు, నవీన్, రాజేష్, మల్లేష్, భాస్కర్ రెడ్డి, అబ్దుల్ వహీద్, విజయలక్ష్మి, శివలీల, స్వాతి, పద్మ, నీరజ, భార్గవి, లక్ష్మీనరసమ్మ, జయమ్మ, చెన్నమ్మ, శ్రీలత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం




# గ్రామీణాభివృద్ధికి కొత్త దిశ!

తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి, పథకం అమలులో సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించడానికి తీసుకున్న నిర్ణయాలు గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వ దృష్టిని ప్రతిబింబిస్తున్నాయి. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఫిక్స్ టెన్యూర్ ఉద్యోగుల గ్రాట్యుటీ డిమాండ్‌కు పరిష్కారం చూపడంతో పాటు, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందికి ఆధునిక పరికరాలు అందించాలని నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్యోగుల ఆర్థిక భద్రతను బలోపేతం చేస్తూనే, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనుల నిర్వహణను మరింత సమర్థంగా మార్చేందుకు ఈ చర్యలు దోహదపడే అవకాశం ఉంది. సంక్షేమం, సాంకేతికత, పరిపాలనా సామర్థ్యం అనే మూడు అంశాలను సమన్వయం చేయడం ద్వారా గ్రామీణాభివృద్ధికి మెరుగైన పునాది వేయవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉపాధి హామీ పథకం గ్రామీణ కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. వ్యవసాయ పనులు తగ్గిన సమయంలో, వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పుడు కూలీలకు ఈ పథకం ఉపాధి అవకాశాలను అందిస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో నగదు చలామణి కొనసాగడానికి కూడా ఇది తోడ్పడుతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు, ఆర్థిక భరోసా కల్పించడం అవసరం. ఈ నేపథ్యంలో దాదాపు 3,800 మంది ఫిక్స్ టెన్యూర్ ఉద్యోగులకు గ్రాట్యుటీ సౌకర్యం కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో నంబర్ 548 ద్వారా ఉత్తర్వులు జారీ చేయడం ఉద్యోగుల సంక్షేమం దిశగా కీలక చర్యగా నిలుస్తోంది. మంత్రి సీతక్క చొరవతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ పరిష్కారానికి మార్గం సుగమమైందని సంబంధిత వర్గాలు భావిస్తున్నాయి. ఈ నిర్ణయం ద్వారా ఉద్యోగుల సేవా కాలాన్ని బట్టి రూ.4 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం లభించే అవకాశం ఉంది. పదేళ్లకు పైగా పనిచేసిన అర్హులైన సిబ్బందికి రూ.10 లక్షల వరకు గ్రాట్యుటీ అందనుంది. పదవీ విరమణ సమయంలో వచ్చే ఈ మొత్తం ఉద్యోగులకు, వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తుంది. దీర్ఘకాలం సేవలందించిన సిబ్బంది భవిష్యత్తుపై భరోసా పెరగడంతో పాటు, తమ సేవలకు గుర్తింపు లభించిందనే భావన బలపడుతుంది. ఈ పథకం అమలుకు నెలకు సుమారు రూ.కోటి నిధులను ఉపాధి హామీ పథకం నుంచే చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్‌ను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను సంక్షేమ పరిపాలనలో ఒక ముఖ్యమైన ముందడుగుగా చూడవచ్చు. ఉద్యోగుల సంక్షేమంతోపాటు పథకం పనితీరును మెరుగుపరిచేందుకు సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వడం మరో ముఖ్యమైన అంశం. రాష్ట్రవ్యాప్తంగా 7,612 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు స్మార్ట్‌ఫోన్లు, 2,172 మంది టెక్నికల్ అసిస్టెంట్లకు ట్యాబ్‌లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్యాదేవరాజన్ సంబంధిత పత్రాలపై సంతకం చేసినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి డిజిటల్ పరికరాలు అందుబాటులోకి రావడం వల్ల సమాచార సేకరణ, పనుల వివరాల నమోదు, సాంకేతిక నివేదికల తయారీ, అధికారులతో సమాచార మార్పిడి వంటి ప్రక్రియలు సులభతరమయ్యే అవకాశం ఉంది. పనుల పురోగతిని వేగంగా సమీక్షించేందుకు, సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కూడా ఈ సాధనాలు ఉపయోగపడతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామీణ ఉపాధి హామీ పనులపై ఒత్తిడి పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని సిబ్బందికి అవసరమైన సాంకేతిక వనరులు అందించడం ప్రాధాన్యం కలిగిన నిర్ణయం. ఎల్-నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవసరాలను సమర్థంగా గుర్తించడం, పనుల నిర్వహణను పర్యవేక్షించడం మరింత ముఖ్యం. క్షేత్రస్థాయి ఉద్యోగులు ఆధునిక పరికరాలను వినియోగిస్తే పనుల వివరాలను త్వరగా అందించడం, అవసరమైన సమాచారాన్ని సంబంధిత అధికారులకు చేరవేయడం సులభమవుతుంది. అయితే పరికరాల పంపిణీతోనే ఆశించిన ఫలితాలు సాధ్యం కావు. వాటి వినియోగంపై శిక్షణ, సాంకేతిక సహాయం, అవసరమైన చోట ఇంటర్నెట్ సదుపాయాలు కల్పించడం కూడా కీలకం. డిజిటల్ వ్యవస్థ ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించి, పనితీరును మెరుగుపరిచే సాధనంగా మారాలి. ఈ రెండు నిర్ణయాలను సమగ్రంగా పరిశీలిస్తే ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం, పరిపాలనా ఆధునికీకరణకు ఒకేసారి ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఒకవైపు దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సిబ్బందికి గ్రాట్యుటీ సౌకర్యం కల్పించడం ద్వారా ఆర్థిక భద్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. మరోవైపు క్షేత్రస్థాయి సిబ్బందికి సాంకేతిక పరికరాలు అందించడం ద్వారా పథకం నిర్వహణలో వేగం, సమర్థత పెంచేందుకు చర్యలు చేపడుతోంది. ఉద్యోగులకు ప్రోత్సాహం లభించడం, పనుల నిర్వహణలో పారదర్శకత పెరగడం, అధికారులకు సమయానుకూల సమాచారం అందడం వంటి అంశాలు సమన్వయంతో అమలైతే గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు మెరుగుపడే అవకాశం ఉంది. అయితే ఈ నిర్ణయాల విజయాన్ని వాటి అమలే నిర్ణయిస్తుంది. అర్హులైన ఉద్యోగులకు గ్రాట్యుటీ సకాలంలో అందేలా చూడటం, చెల్లింపులకు సంబంధించిన మార్గదర్శకాలను స్పష్టంగా రూపొందించడం అవసరం. అదేవిధంగా స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, వాటి ద్వారా పనుల వివరాలు సక్రమంగా నమోదు అవుతున్నాయో లేదో పరిశీలించాలి. ఉపాధి పనుల గుర్తింపు నుంచి హాజరు నమోదు, పనుల కొలతలు, వేతనాల చెల్లింపుల వరకు ప్రతి దశలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా గ్రామీణ కూలీలకు ఉపాధి అవకాశాలు అందడం, వేతనాలు సకాలంలో చెల్లించడం, ఫిర్యాదులను పరిష్కరించడం వంటి అంశాల్లోనూ ఇదే శ్రద్ధ కొనసాగాలి. మొత్తంగా తెలంగాణ ప్రభుత్వం ఉపాధి హామీ ఉద్యోగుల సంక్షేమం, సాంకేతిక ఆధునికీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం గ్రామీణ పాలనను బలోపేతం చేసే చర్యగా నిలుస్తుంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ డిమాండ్ పరిష్కారానికి చర్యలు చేపట్టడం ఉద్యోగులకు భరోసానిస్తే, క్షేత్రస్థాయి సిబ్బందికి డిజిటల్ పరికరాలు అందించడం పథకం నిర్వహణను మెరుగుపరిచేందుకు అవకాశాలు కల్పిస్తుంది. ఈ నిర్ణయాలు సమర్థంగా అమలైతే ఉద్యోగులతోపాటు గ్రామీణ కూలీలు, ఉపాధి హామీపై ఆధారపడే కుటుంబాలకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. సంక్షేమాన్ని బాధ్యతాయుతమైన పాలనతో, సాంకేతికతను పారదర్శకతతో అనుసంధానించినప్పుడే ప్రభుత్వ నిర్ణయాలు క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పును తీసుకురాగలవు. గ్రామీణ ప్రజల జీవన భద్రతను పెంపొందిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లడమే ఈ చర్యల అసలైన లక్ష్యంగా ఉండాలి.

# రిజర్వేషన్లు ఎవరికి లాభం..?




ఏపీలో స్థానిక ఎన్నికలకు త్వరలో నగారా మోగనుంది. దీంతో మరోసారి రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వచ్చేసింది. ఇప్పుడు జరిగేది పేరుకి స్థానిక ఎన్నికలే అయినా.. మధ్యంతర ఎన్నికల తరహా రాజకీయ వేడి ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే పార్టీలన్నీ స్థానిక ఎన్నికల కోసం వ్యూహప్రతివ్యూహాలతో సిద్ధం కావడం.. మేయర్, జడ్పీ ఛైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు వంటి అంశాలు.. స్థానిక సమరాన్ని ఖరీదైన పోరుగా మార్చేస్తాయనే అంచనాలున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల్ని పక్కనపెట్టి.. ప్రస్తుతం ఏ పార్టీ బలబలాలు ఎలా ఉన్నాయో సరి చూసుకోవటానికి స్థానిక సమరం ఉపయోగపడుతుందనే అభిప్రాయాలున్నాయి. అదే సమయంలో స్థానిక ఎన్నికల గెలుపోటములతో సంబంధం లేకుండా సరైన సన్నద్ధతతో ఉంటే.. ఏమైనా లోటుపాట్లుంటే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి వాటిని దిద్దుకోవచ్చనే వాదన కూడా లేకపోలేదు. ఇలా ఈసారి ఏపీ స్థానిక ఎన్నికలకు ఎక్కడలేని రాజకీయ ప్రాధాన్యత వచ్చేసింది. ఇంతకూ గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు సాధించిన ఓట్ల శాతం.. ఇప్పుడు కూడా అలాగే ఉంటుందా.. ఏదైనా మార్పు ఉంటుందా.. అనేది తేలాల్సి ఉంది. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ 80 నుంచి 90 శాతం సీట్లు సాధించే అవకాశం ఉండటం.. సాధారణమే. సహజంగానే యంత్రాంగం కూడా అధికార పార్టీకి సహకరిస్తుంది కాబట్టి.. ఏకగ్రీవాలు కూడా జోరుగానే అవుతాయి. అలాగని స్థానిక సమరాన్ని తేలిగ్గా తీసుకోవటానికి విపక్షం సిద్ధంగా లేదు. అందుకే వైసీపీ అధినేత జగన్ ఏకగ్రీవాలైనచోట.. నియోజకవర్గ ఇంఛార్జులు ఎమ్మెల్యే టికెట్లపై ఆశలు వదులుకోవాలని తేల్చిచెప్పారు. ఆమాటకొస్తే.. స్థానిక ఎన్నికల ఫలితాలను సీరియస్‌గా తీసుకోవటం కూడా కుదిరే పని కాదు. ఎందుకంటే 2019-24 మధ్యకాలంలో జరిగిన స్థానిక పోరులో వైసీపీ 90 శాతం పైగా సీట్లు సాధించింది. కానీ అసెంబ్లీకి వచ్చేసరికి కేవలం 11 సీట్లు సాధించి.. పూర్తిగా చతికిలపడింది. మొత్తం మీద స్థానిక పోరుతో.. ఏపీలో రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది. ఎప్పుడూ లేనంత ఉత్కంఠకు తెరతీస్తున్న స్థానిక ఎన్నికలు.. నెల రోజుల పాటు.. రాష్ట్రంలో గ్రామగ్రామాన నరాలు తెగే ఉత్కంఠను అందిస్తాయనడంలో సందేహం లేదు. ఏపీలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు కసరత్తు పూర్తి చేసింది. షెడ్యూల్ ప్రకటన వెలువడే రోజే మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి కీలకమైన స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియను ఖరారు చేస్తూ ప్రభుత్వం మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ వివరాలను వెంటనే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అందించనుంది. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీకి రాష్ట్రంలోని 20 గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆహ్వానించారు. పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలను దశలవారీగా నిర్వహించేందుకు వీలుగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడివిడిగా నోటిఫికేషన్లు జారీ చేయనుంది. షెడ్యూల్ ప్రకటించిన మరుక్షణం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమల్లోకి రానుంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన మూడో రోజు నుంచి మున్సిపాలిటీల్లో అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియను నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి కేవలం 16 రోజుల్లో పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను మొత్తం 14 రోజుల్లోనే పూర్తి చేసేలా అధికారులు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశారు. వీటన్నింటికి వేర్వేరుగా షెడ్యూల్ విడుదల చేయనున్నారు. గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు ఒక దశలోనే నిర్వహించనున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పరిశీలిస్తోంది. పంచాయతీలకు మాత్రం పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి 14 రోజుల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై ఒంటి గంటకు ముగియనుంది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటిస్తారు. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలు నోటిఫికేషన్ నుంచి 15 రోజుల్లో, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 16 రోజుల్లో పూర్తి చేయనున్నారు. పోలింగ్ పూర్తయిన రెండు రోజుల తరువాత వీటిలో ఓట్లు లెక్కించనున్నారు. పంచాయతీ ఎన్నికలు మినహా మిగిలిన స్థానిక ఎన్నికలన్నీ పార్టీ పరంగా నిర్వహిస్తారు. నోటిఫికేషన్, ఎన్నికల షెడ్యూల్ ఏది ముందు వెలువడితే.. అదే రోజు నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఎన్నికలకు మొత్తం 1,05,432 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. స్థానిక ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం.. ఫొటోతో కూడిన పూర్తి స్థాయి ఓటర్ల జాబితాలను సిద్ధం చేయించారు. ఓటర్ల జాబితాను సిద్ధం చేయటంలో ఎలాంటి లోపాలు జరగకుండా చూసుకోవాలని అధికారులకు ముందే స్పష్టం చేశారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ప్రాథమిక ఓటర్ల జాబితాలను సెప్టెంబర్ 11వ తేదీ సంబంధిత మండల పరిషత్ కార్యాలయాలు, ఇతర నిర్దేశిత కేంద్రాల్లో నోటీస్ బోర్డులలో ప్రదర్శించారు. ఓటర్లు తమ పేర్లు ఓటరు జాబితాలో సరిచూసుకునేందుకు, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఏవైనా ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు ఇది ఉపకరించనుంది. మరోవైపు ఏపీలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం సెప్టెంబర్ 23, 24వ తేదీలతో ముగిసింది. ఈ తరుణంలో పాలనాపరమైన ఇబ్బందులు రాకుండా ఉండేందుకు, సకాలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఏతావాతా ఏపీలో స్థానిక ఎన్నికలకు అటు ఎస్ఈసీ, ఇటు పార్టీల వైపు నుంచి పూర్తిస్థాయి సన్నద్ధత కనిపిస్తోంది. ఇప్పటికే పార్టీల కింది స్థాయి క్యాడర్ కూడా పూర్తిస్థాయిలో స్థానిక ఎన్నికల మూడ్‌లోకి వచ్చేసింది. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లోనే కింది స్థాయి క్యాడర్‌కు ఎక్కువగా పదవులు దక్కే అవకాశం ఉండటంతో.. ఈ ఎన్నికలు ఎంపీలు, ఎమ్మెల్యేలకు కూడా కీలకం కానున్నాయి. ఈ ఎన్నికలు వీరి దగ్గర నుంచి సరైన సహాయ సహకారాలు అందకపోతే.. ఆ ప్రభావం రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల మీద ఉంటుందనడంలో సందేహం లేదు. దీనికి తోడు ఇప్పటికే పార్టీల అధిష్ఠానాల నుంచి ప్రజాప్రతినిధులకు హెచ్చరికలు వచ్చాయి. ఎవరి నియోజకవర్గంలో వారు బాధ్యత తీసుకుని మెజార్టీ సీట్లు గెలిచేలా కృషిచేయాలనే ఆదేశాలు వచ్చాయి. అలా చూసుకున్నప్పుడు.. ఓవైపు అధిష్ఠానాల హెచ్చరికలు, మరోవైపు కింది స్థాయి క్యాడర్ నుంచి ఒత్తిడితో ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా బాగా టెన్షన్ పడుతున్నారు. ఎవరికి వారు తమవైపు నుంచి ఎక్కడా తేడా రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏపీలో రెండున్నరేళ్ల క్రితం అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మళ్లీ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికలు జరగబోతున్నాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. మరి ఆ ఓట్ల శాతాన్ని వైసీపీ ఎంతవరకు నిలబెట్టుకుంటుందనేది ఇప్పుడు కీలకం కానుంది. 2019-24 మధ్య స్థానిక ఎన్నికల్లో అప్పుడు విపక్షంగా ఉన్న టీడీపీ పోటీ చేయలేదు. కానీ ఈసారి విపక్షం వైసీపీ స్థానిక సమరాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటోంది. ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాల మాటే వినిపించొద్దని ఇప్పటికే జగన్ తమ పార్టీ నేతలకు వార్నింగ్ ఇచ్చారు. గెలుపోటములతో సంబంధం లేకుండా బలమైన అభ్యర్థులు బరిలో నిలిపి.. గట్టిగా పోరాడాలని దిశానిర్దేశం చేశారు. అధికార పార్టీ మెజార్టీ స్థానాలు గెలిచినా.. ఆ గెలుపు మాత్రం అంత తేలికగా దక్కకూడదనేది వైసీపీ వ్యూహంగా ఉంది. దీనికి తోడు ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతున్న మేయర్, జడ్పీ ఛైర్మన్ పదవుల విషయంలోనూ ప్రత్యేక వ్యూహరచన ఉండాలని వైసీపీ కంకణం కట్టుకుంది. అధికారం కోల్పోయిన దగ్గర్నుంచీ కొందరు ఇంఛార్జులు నామమాత్రంగా పనిచేస్తున్నారన్న నివేదికలు అందడంతో.. జగన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికే కొందరు నేతలకు జగన్ హితవు చెప్పిన తర్వాత కూడా పద్ధతి మార్చుకోకపోవడంతో.. ఇక ఉపేక్షించకూడదనే నిర్ణయానికి వచ్చారని చెబుతున్నారు. దీనికి తోడు ఏపీలో కూటమి పాలనకు రెండేళ్లు పూర్తైన తరుణంలో.. ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవటానికి ఇది సరైన సందర్భమని జగన్ భావిస్తున్నారు. తద్వారా పాలక పక్షంపై ఉన్న వ్యతిరేకతను ఓట్ల రూపంలో సంఘటితం చేయటానికి.. ప్రతిపక్షం ఎక్కడికక్కడ గట్టిగా పోరాడాలని శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. అంతేకాదు 2029 ఎన్నికలకు కార్యాచరణ తేల్చుకోవటానికి కూడా స్థానిక సమరం కీలకంగా మారుతుందని జగన్ చెబుతున్నారు. అందుకే స్థానిక ఎన్నికలు ముగిసిన తర్వాత.. నియోజకవర్గాల వారీగా పోస్ట్‌మార్టమ్ చేస్తామని కూడా జగన్ ముందే చెప్పేశారు. దీంతో స్థానిక ఎన్నికల సందర్భంగా ఏ పొరపాటు జరిగినా.. భారీ మూల్యం చెల్లించక తప్పదని వైసీపీ నేతలకు ఓ క్లారిటీ వచ్చేసింది. అటు టీడీపీ కూడా అధికార పార్టీగా ఉన్న అడ్వాంటేజ్‌ను వాడుకోవడంతో పాటు విపక్షంపై స్పష్టమైన పైచేయి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల గెలుపుతో పనైపోలేదు. స్థానిక ఎన్నికల్లోనూ గెలిచినప్పుడే విజయం సంపూర్ణమవుతుందని చంద్రబాబు ఇప్పటికే చెబుతున్నారు. అంతేకాదు ఏపీలో ట్రిపుల్ ఇంజిన్ సర్కారు ఉండాలని ఢంకా బజాయిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అవలంబించిన వ్యూహాలు అమలు చేసి.. ఇప్పుడు కూడా కూటమిలో ఐక్యత ఉండేలా చూడాలని కోరుతున్నారు. ఇప్పటికే ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి కసరత్తు మొదలుపెట్టారు. ప్రతిపక్షానికి ఏ చిన్న అవకాశం ఇచ్చినా.. అది స్వీయ తప్పిదమే అవుతుందనే సంగతి గుర్తుంచుకోవాలని నేతలకు గట్టిగా చెబుతున్నారు. స్థానిక సమరంలో పాలక పక్షానికి ఉండే సహజ అనుకూలతను ఉపయోగించుకుని.. సత్తా చాటాలని హితబోధ చేస్తున్నారు. అంతేకాకుండా కూటమి పాలనపై ప్రజల్లో ఉన్న సానుకూలతను క్యాష్ చేసుకుని.. అత్యధిక సంఖ్యలో స్థానాలు గెలవాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ఇలా ఇటు కూటమి, అటు వైసీపీ స్థానిక సమరాన్ని సీరియస్‌గా తీసుకుంటుండటంతో.. లోకల్ ఎలక్షన్ హీట్ తారస్థాయికి చేరే అవకాశం కనిపిస్తోంది. ఈ లెక్కన గ్రామ స్థాయి నుంచి పై వరకూ ఎన్నికల హడావుడి కొట్టొచ్చినట్టు కనిపించడం ఖాయమే. మొత్తం మీద ఏపీలో ఈసారి స్థానిక సమరం కూడా రాజకీయ పందెంరాయుళ్లకు పంట పండిస్తుందనే అంచనాలున్నాయి. అలాగే ప్రత్యక్ష ఎన్నికలు జరిగే మేయర్, జడ్పీ ఛైర్మన్ పదవులు ఎవరు గెలుస్తారనేది ఉత్కంఠకు దారితీస్తున్న అంశం. ఏపీలో ఐదేళ్లకోసారి రాజకీయ బలాబలాలు మారిపోతున్న తరుణంలో.. ఈసారి స్థానిక ఫలితాలు మామూలుగానే ఉంటాయా..? ఎక్కడైనా అనూహ్య ఫలితాలకు అవకాశం ఉందా..? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. ఏపీలో చాలా నియోజకవర్గాల్లో గత అసెంబ్లీ ఎన్నికల వేడి ఇంకా నివురుగప్పిన నిప్పులా అలాగే ఉందనే వాదన ఉంది. అలాంటి తరుణంలో స్థానిక ఎన్నికల నగారా మోగితే.. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇటీవలి అరెస్టులు, కేసులు, విచారణల్ని కూడా దృష్టిలో పెట్టుకుని బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి కోర్టు కేసులు కూడా పెరుగుతాయనే అంచనాలతో అధికారులు సిద్ధమౌతున్నారు. గతంలో మాదిరిగా సాంకేతిక తప్పిదాలు జరగకుండా జాగ్రత్తపడాలని ఇప్పటికే ఎస్ఈసీ నుంచి ఆదేశాలు వచ్చాయంటున్నారు. ఈసారి స్వల్ప తేడాతో విజేతలు డిసైడయ్యే పరిస్థితులు ఉన్నచోట కూడా అప్రమత్తంగా ఉండాలనే సూచనలున్నాయి. ఇక ప్రత్యక్ష ఎన్నికలు జరిగే పదవుల విషయంలో కచ్చితంగా అసెంబ్లీ ఎన్నికల స్థాయి హైఅలర్ట్ అవసరమనే అభిప్రాయాలున్నాయి. స్థానిక ఎన్నికల్లో పార్టీల బలాబలాలతో పాటు స్థానిక పరిస్థితులు కూడా కీలక పాత్ర పోషిస్తాయనేది అందరికీ తెలిసిన విషయమే. అలాగే ఒక్కోచోట ఒక్కోమాదిరిగా రాజకీయ వాతావరణం ఉంటుంది. వీటన్నింటినీ గమనంలోకి తీసుకుని పార్టీలతో పాటు అధికార యంత్రాంగం కూడా తీవ్ర కసరత్తు చేయక తప్పదు. ఎక్కడ తేడా వచ్చినా.. ముందు అధికారులే బుక్కయ్యే పరిస్థితి రాకుండా చూసుకోవడం.. కత్తి మీద సామే అంటున్నారు.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# అసోసియేషన్ల వికృత దందా

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో సెక్షన్ 22ఏ ప్లాట్లు, ఇండ్ల యజమానులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. ఎప్పుడో 20, 30 ఏండ్ల క్రితం కొనుగోలు చేసిన వాటిని ప్రభుత్వ ల్యాండ్, యూఎల్సీ ల్యాండ్, అసైన్డ్ అంటూ కొర్రీలు పెడుతున్నారు. తదుపరి రిజిస్ట్రేషన్లు కాకుండా ఆటో లాక్ చేశారు. తాజాగా అక్రమ నిర్మాణాలను కూడా నిషేధిత జాబితాలో పెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. దాంతో తాము కొనుగోలు చేసిన ప్లాట్లల్లో అన్ని రకాల అనుమతులు తీసుకొని కట్టిన ఇండ్లు ఇప్పుడు ఏ కేటగిరి కిందికి వస్తాయి? అక్రమ నిర్మాణాలేనా? ఇప్పటికే ఇంటి స్థలం పీవోబీలో పెట్టారంటూ ఆందోళనకు గురవుతున్నారు. ఆ స్థలాలు సేల్ డీడ్స్ ద్వారా కొనుగోలు చేసిన ఆధారాలు ఉన్నప్పుడు నిషేధం విధించడం చట్టరీత్య తగదు. కానీ అధికారులు అత్యుత్సాహంతో ఎలాంటి ఆధారాలు లేకుండానే నిషేధం విధించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఈ క్రమంలో తమ ప్రాపర్టీస్ ని ఆ జాబితా నుంచి ఎలాగైనా డెలీట్ చేయించుకోవాలన్న తాపత్రయంతో ఉన్నారు. రూ.లక్షలు, రూ.కోట్ల విలువజేసే ఆస్తులు తమవి కాకుండా పోతాయన్న భయం పట్టుకుంది. అలాగే అవసరానికి అమ్మేద్దామంటే ఎవరూ ముందుకు రారని రూఢీ అయ్యింది. దాంతో క్లీన్ షీట్ పొందేందుకు ఎంతైనా ఖర్చు చేసారని దళారులు గుర్తించారు. ఇప్పుడా దందా స్పీడ్ అందుకున్నది. అధికారుల పేరు చెప్పి రూ.లక్షలు గుంజే ప్రయత్నాలు చేస్తున్నాయి. కొన్ని చోట్ల రెసిడెంట్స్ అసోసియేషన్, కాలనీ అసోసియేషన్ పేరిట వసూళ్ల దందా కొనసాగుతుంది. కొన్ని చోట్లేమే మధ్య దళారులు తాము అధికారులతో మాట్లాడి క్లియర్ చేయిస్తామంటూ పైరవీలకు ముందుకొస్తున్నారు. జీహెచ్ఎంసీ, ఎంఎసీ, సీఎంసీ పరిధిలో ఎక్కడ చూసినా గజం రూ.లక్షల్లోకి చేరింది. అందుకే ప్రతి ప్లాట్ కి రూ.5 లక్షల వరకు ఖర్చుల కింద వసూళ్లకు తెగిస్తున్నారు.

**సుమోటోగా డిలీట్ చేయాలి..**

రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాల వల్ల లక్షలాది మంది ప్లాట్లు, ఇండ్ల యజమానులు ఇబ్బందులకు గురవుతున్నారు. వారి చేసిన తప్పులను సరిదిద్దుకోవాలంటే సుమోటోగానే సెక్షన్ 22ఏ కింద రూపొందించిన డేటాను మార్చుకోవాలి. సేల్ డీడ్స్ ఆధారంగా కొనుగోలు చేసిన వారి ప్రాపర్టీస్ ని విధిగా లిస్టుల నుంచి తొలగించాలి. ఐతే దీనికి అప్లికేషన్లు పెట్టండి. వారి దగ్గరున్న డాక్యుమెంట్లను సమర్పించండంటూ కొర్రీలు పెడుతున్నారు. ఈ డాక్యుమెంట్ లేదు.. ఆ డాక్యుమెంట్ లో పొరపాటు ఉంది. పాత పహానీలో లావునీ ఉందని, పొరంబోకు అని ఉందంటూ భయపెట్టిస్తున్నారు. ఐతే అదే ల్యాండ్ ఆ తర్వాత పహానీల్లో మార్పులు చేసిన అధికారులను మాత్రం ప్రశ్నించడం లేదు. వారికి నోటీసులు జారీ చేయడం లేదు. తప్పుడు రికార్డులు రాసిన వారికి, అసైన్డ్ భూముల్లో లే అవుట్లకు అనుమతులు జారీ చేసిన అధికారులెవరికీ ఎలాంటి శిక్షలు లేవు. కానీ అనుమతులు ఉన్నాయని తెలిసి కొనుగోలు చేసిన యజమానులకు మాత్రం చుక్కలు చూపిస్తున్నారు. డబ్బులు పెట్టి కొనుగోలు చేసిన వారు అదే అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

**పొరంబోకు.. గ్రూప్ హౌజింగ్ స్కీం**

మేడ్చల్ జిల్లా కాప్రాలో ఓ సర్వే నంబరులోని పూర్తి విస్తీర్ణాన్ని సెక్షన్ 22ఏ కింద నమోదు చేశారు. హిస్టరికల్ రెవెన్యూ రికార్డులు, మ్యుటేషన్ ప్రొసిడింగ్స్, రిజిస్ట్రేషన్ సేల్ ట్రాన్సక్షన్లు, ల్యాండ్ యూజ్ చేంజ్ కి సంబంధించిన అప్రూవల్స్, లే అవుట్లు, నిర్మాణాలకు అనుమతులు, బ్యాంకులు అన్ని డాక్యుమెంట్లు చూసి రుణాలు మంజూరు చేసిన డాక్యుమెంట్లు అన్నీ ఉన్నాయి. పట్టా ల్యాండ్స్ అని రికార్డుల్లో ఉన్నందునే కొనుగోలు చేశామని ప్లాట్ల యజమానులు అంటున్నారు. 1991--92 పహానీ నుంచి పట్టాగా రికార్డుల్లో నమోదైంది. ఓ బడా కంపెనీ పట్టాదారుల నుంచి కొనుగోలు చేసింది. ఆ తర్వాత లే అవుట్ చేసి అమ్మేసింది. వల్లభనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సేల్ డీడ్స్ జరిగినట్లు ఈసీలో స్పష్టంగా ఉంది. 1995 లోనే జీవో 211 ఆధారంగా కన్జర్వేషన్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్ గా మార్చినట్టుగా ఉంది. 1995లోనే హైదరాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(హుడా)కు డెవలప్మెంట్ చార్జీలు, గ్రీన్ బెల్ట్ చార్జీలు, ప్రొసిడింగ్ చార్జీలు కట్టేశారు. గ్రూప్ హౌజింగ్ స్కీం కింద హుడా అనుమతులు జారీ చేసింది. ఐతే 1955--58 వరకు అది పొరంబోకుగా ఉంది. ఆ తర్వాత ఓ పట్టాదారుడి పేరిట రాస్తూనే క్లాసిఫికేషన్ లో పొరంబోకుగా పేర్కొన్నారు. 1970--1994 వరకు పొరంబోకు, పట్టాగా నమోదు చేశారు. 1996--07 నుంచి 2014--15 వరకు పొరంబోకు, లావునీ పట్టాగా మారింది. అనుభవదారు కాలమ్ లో మాత్రం ప్లాట్లు/ఇండ్లుగా పేర్కొన్నారు. ఇలా రెవెన్యూ ఉద్యోగులు, అధికారుల మాయాజాలంతో అది ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. అక్కడ ప్లాట్లు, ఇండ్లు కొనుగోలు చేసిన వారందరికీ కంటి మీద కునుకు లేకుండా 22ఏ లిస్టు చేస్తున్నది.

**ఇప్పుడు ప్లాట్‌కు రూ.5 లక్షలు**

ఎలాగైన పీవోబీ నుంచి తమ ప్లాట్లు, ఇండ్లను డెలీట్ చేయించుకునేందుకు వ్యూహరచన చేశారు. దాని కోసం 21 రకాల డాక్యుమెంట్లను రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సిద్ధం చేసింది. ఇదంతా పకడ్బందీగా డ్రాఫ్ట్ చేశారు. తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఏలకు సమర్పించేందుకు అంతా రెడీ చేసుకున్నారు. ప్లాట్లు, ఇండ్ల యజమానులంతా సంతోషించారు. అసోసియేషన్ సభ్యులు బాగా కష్టపడుతున్నారంటూ ప్రశంసించారు. కొద్ది రోజులకే ఏమైందో ఏమో.. ఏ అధికారి ఏం అడిగారో, ఏం సలహాలు ఇచ్చారో అంతు చిక్కలేదు. కానీ ప్రతి ప్లాట్ యజమాని రూ.5 లక్షల వంతున చెల్లించాల్సిందేనని తీర్మానించారు. ఎప్పుడో కొనుగోలు చేశాం. ఇప్పుడు ప్లాట్ కి రూ.5 లక్షలు ఎందుకంటూ నిలదీస్తున్నారు. అందరి ప్లాట్లు 22ఏ లిస్టు నుంచి తీస్తే మాదీ తీసేస్తారు. మాదొక్కటే ఎందుకు పెండింగ్ పెడతారంటూ యజమానులు మండిపడ్డారు. ఇంతకీ అంత ఖర్చు ఎందుకు అవుతుందంటూ ఓ వ్యాపారి ఆరా తీశాడు. పైసా ఖర్చు లేకుండా సుమోటోగా చేయాల్సిన పనికి అసోసియేషన్ వసూలు చేస్తుందా? అధికారులు నిజంగానే అడిగారా? అన్న సందేహం తలెత్తింది.

**ముప్పుతిప్పలు పెడుతున్న అధికారులు**

లే అవుట్ నాలుగైదు సర్వే నంబర్లలో ఉంటే ప్లాట్ సేల్ డీడ్ లో అన్ని నంబర్లు ఉండొద్దు. ఆ ప్లాట్ ఏ సర్వే నంబరులో ఉందో అదొక్కటే ఉండాలంటూ కొందరు తహశీల్దార్లు ముప్పుతిప్పలు పెడుతున్నారు. ప్లాట్ యజమానియే ఆ ప్లాట్ ఏ సర్వే నంబరులో ఉందో తెలిపాలి. లేదంటే భూ భారతిలో అప్లై చేసుకోవాలంటూ కొత్త భాష్యం చెప్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అప్పుడు ఆ సర్వే నంబరుని సర్వే చేస్తాం. ఆ నంబరు పీవోబీలో లేకపోతే ఎండార్స్మెంట్ ఇస్తాం. లేదంటే కలెక్టర్ కి రాస్తాం. అక్కడి నుంచి ఎన్వోసీ తెచ్చుకోండంటూ కాలయాపన చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ తిరస్కరణల నేపథ్యంలోనే ప్రతి ప్లాట్, ఇంటి యజమాని తమ ప్రాపర్టీపై చిక్కుల్లేకుండా ఉండేందుకు ఖర్చుకు వెనుకడుగు వేయడం లేదు. ఈ క్రమంలో కొందరు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు అధికారుల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం.

**ప్రభుత్వం బద్నాం..**

జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో 30, 40 ఏండ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లు, 20 ఏండ్ల అన్ని రకాల అనుమతులతో ఇండ్లు కట్టుకున్న ప్రాపర్టీస్ సెక్షన్ 22ఏ కింద చేర్చారు. ఇప్పుడా లిస్టులను ప్రక్షాళన చేయకుండా అధికారులు దాటవేత ధోరణిని అవలంభిస్తున్నారు. యజమానులు ఈ నిషేధిత జాబితాలను చూసి భయపడుతున్నారు. ప్రాపర్టీస్ అంశంలో ఉద్దేశ్యపూర్వకంగా, 22ఏ లిస్టులను ప్రక్షాళన చేయకుండా ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే అధికారులు కంకణం కట్టుకొని కూర్చున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రాపర్టీస్ యజమానులను ఇబ్బందులకు గురి చేసిన విషయం కీలకం కానున్నది.



# ఐదేళ్ల తర్వాత ఆచూకీ లభ్యం..

**తిప్పర్తి,ఫ్లాష్ ఇండియా :** ఐదేళ్ల క్రితం తప్పిపోయిన మహిళ ఆచూకీని తిప్పర్తి పోలీసులు గుర్తించి, ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన చెరుకుపల్లి అపర్ణ(21) 2021లో తప్పిపోయినట్లు అందిన ఫిర్యాదు మేరకు తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును తిప్పర్తి ఎస్ఐ ఇరుగు రవి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది జి.శ్రీనివాస్ రెడ్డి, కడారి సతీష్, రాము రెడ్డి తదితరులు సమన్వయంతో దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, కాల్ డేటాను విశ్లేషించిన పోలీసులు అపర్ణ హైదరాబాద్‌లో నివసిస్తున్నట్లు గుర్తించారు. విచారణలో ఆమె తన దగ్గరి బంధువైన గాదరి ప్రవీణ్‌ను వివాహం చేసుకుని హైదరాబాద్‌లో ఉంటున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో అక్టోబర్ 12, 2026న పోలీసు సిబ్బంది అపర్ణను గుర్తించి నల్గొండలోని భరోసా కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడ ఆమె స్టేట్‌మెంట్‌ను నమోదు చేసిన అనంతరం, అపర్ణకు తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నప్పటి నుంచి సంరక్షణ అందించిన ఆమె అమ్మమ్మకు అప్పగించారు. ఐదేళ్ల తర్వాత తప్పిపోయిన మహిళ ఆచూకీని గుర్తించి, ఆమెను కుటుంబ సంరక్షణకు అప్పగించడంలో కృషి చేసిన ఎస్ఐ ఇరుగు రవి, పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు అరెస్ట్..!




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లో భారత్ - వెస్టిండీస్ జట్ల మధ్య ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నేడు నాలుగో టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు ముందు సంబంధించి కాంప్లిమెంటరీ టికెట్లను అక్రమంగా బ్లాక్‌లో విక్రయిస్తున్న ముఠా గుట్టును గోషామహల్ పోలీసులు రట్టు చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు సతీష్ చంద్ర శ్రీవాస్తవ తన కుమారుడు ఆకర్షిత్ శ్రీవాస్తవ ద్వారా 'నాట్ ఫర్ సేల్' పాస్‌లను ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వేదికగా భారీ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. హెచ్‌సీఏ మెంబర్ ద్వారా కాంప్లిమెంటరీ టికెట్లు సేకరించి బ్లాక్‌లో విక్రయాలు జరుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. బేగంబజార్‌లోని ఎస్‌డీ మాల్ సమీపంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు.. సతీష్ చంద్ర శ్రీవాస్తవ, ఆయన కుమారుడితో పాటు మరో ఇద్దరు నిందితులు అవినాష్ దరక్, మోహిత్ సోమానీలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 11 మ్యాచ్ టికెట్లు, 8 దాండియా పాస్‌లు, నగదు, ఓ స్కూటర్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. భారత్ -- వెస్టిండీస్ జట్ల మధ్య హైదరాబాద్‌లోని ఉప్పల్ వేదికగా నేడు నాల్గో టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు బ్యాటర్లదే ఆధిపత్యం ఉండగా, ఉప్పల్ పిచ్‌ను కొత్త మట్టితో పునరుద్ధరించడం వల్ల బ్యాటర్లు ఆచితూచి ఆడాల్సి రావచ్చు. రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని టీమిండియా ఐదో సిరీస్ విజయంపై కన్నేసింది. భారత జట్టులో వైస్ కెప్టెన్ తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, నితీష్ రెడ్డిలకు స్థానిక పిచ్‌పై మంచి అవగాహన ఉండటం అదనపు బలం కాగా, పేసర్ మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ విండీస్ బ్యాటర్లను కట్టడి చేసేందుకు సిద్ధమయ్యారు. విండీస్‌లో పవర్ హిట్టర్లు ఉన్నప్పటికీ, సొంతగడ్డపై ఆడుతున్న భారతే ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. టాస్, మంచు ప్రభావం ఈ మ్యాచ్ ఫలితాన్ని శాసించే అవకాశం ఉంది. గతంలో ఇక్కడ భారత్ భారీ స్కోరు సాధించిన జ్ఞాపకాలు ఉండటంతో, నేడు కూడా పరుగుల వరద పారే అవకాశం ఉంది.

# సీజేపీకి ఫారిన్ ఫండింగ్‌పై ఆధారాలు చూపండి..



**ఢిల్లీ :** ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన కాక్రోచ్ జనతా పార్టీ కీలక నేతలు సౌరభ్ దాస్, ఆశుతోష్ రాంకా, అజింక్యా షిండేలకు న్యాయస్థానం 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే తీవ్రంగా మండిపడ్డారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని నడుపుతోందని ఆయన ఆరోపించారు.

**అప్రకటిత ఎమర్జెన్సీపై ఆగ్రహం..**

ఇవాళ నాగ్‌పూర్‌లో అభిజిత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ఎమర్జెన్సీ విధించాలనుకుంటే ప్రధాని నరేంద్ర మోదీ అధికారికంగా ప్రకటించాలని సెటైర్లే వేశారు. జంతర్ మంతర్ వద్ద కేవలం జాతీయ జెండాను ప్రదర్శించినందుకు 5 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి పంపడం ఎలాంటి పాలన అని ప్రశ్నించారు. గతంలో ఎమర్జెన్సీ సమయంలో కూడా ఇలాంటి పరిస్థితులు లేవన్నారు. ధైర్యం ఉంటే ఎమర్జెన్సీని అధికారికంగా ప్రకటించాలని ధ్వజమెత్తారు. పోలీసుల వెనుక దాక్కుంటున్న వీరంతా పిరికివారని అభిజిత్ దీప్కే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**న్యాయవాదులను కలవనివ్వట్లేదు..**

అయితే, నిన్నటి నుంచి సౌరభ్ దాస్, ఆశుతోష్ రాంకా, అజింక్యా షిండేలను చట్టవిరుద్ధంగా నిర్బంధంలో ఉంచారని, వారిని కనీసం న్యాయవాదులను కూడా కలవనివ్వలేదని అభిజిత్ దీప్కే ఆరోపించారు. ఇవాళ ఉదయం సౌరభ్, ఆశుతోష్‌లకు 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారని, అసలు వారు చేసిన నేరమేంటని ప్రశ్నించారు. అదేవిధగా ఆయన 'ఇండీ' కూటమి చేస్తున్న నిరసనలపై మాట్లాడుతూ.. తామంతా ఒకే లక్ష్యం కోసం పోరాడుతున్నామని స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగానే తమ అందరి పోరాటమని తెలిపారు.

**స్వతంత్ర శక్తిగా సీజేపీ..**

కాక్రోచ్ జనతా పార్టీ ఒక స్వతంత్ర ఒత్తిడి సమూహం అని, ఎప్పటికీ అలాగే ఉంటుందని అభిజిత్ దీప్కే స్పష్టం చేశారు. కానీ సీజేపీ ఫారిన్ ఫండింగ్‌తో నడుస్తోందని కేంద్రం ఆరోపిస్తోందని.. ఈ విషయంలో కేంద్ర హోంశాఖ మంత్రి దర్యాప్తు చేయించి నిజానిజాలు వెలికితీసి ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం, ఓటు హక్కు పరిరక్షణ కోసమే తమ ఉద్యమని అభిజిత్ దీప్కే అన్నారు.

# ఒక్కో ఇంటికి అదనంగా రూ.72,000

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో పేదల గృహ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'ఇందిరమ్మ ఇళ్ల' పథకాన్ని కేంద్ర ప్రభుత్వ నివాస పథకం పీఎం ఆవాస్ యోజన తో అనుసంధానించాలని నిర్ణయించింది.

**రెండు విడతల్లో లబ్ధిదారుల నమోదు..**

ఈ క్రమంలోనే మొదటి విడత కింద ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన 1.75 లక్షల ఇందిరమ్మ ఇళ్ల వివరాలను అధికారులు పీఎం ఆవాస్ యోజన అధికారిక పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేశారు. ఆ వెంటనే రెండో విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మట్టి గుడిసెలు, తాత్కాలిక నివాసాల్లో జీవిస్తున్న మరో 25 వేల మంది లబ్ధిదారులను కూడా ఈ స్కీమ్ పరిధిలోకి తీసుకురానున్నారు. ఈ అనుసంధాన ప్రక్రియ పూర్తిగా ముగిసిన వెంటనే, కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన కోటా ప్రకారం లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.72,000 నిధులు జమ కానున్నాయి. అయితే, పీఎం ఆవాస్ యోజన పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి మొత్తం 2 లక్షల ఇళ్లు మంజూరు కాగా, ఒక్కో ఇంటి నిర్మాణం కోసం కేంద్రం రూ.72 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే.

# కోతుల బెడదతో బెంబేలు..

## మున్సిపాలిటీకి చిన్నారుల మొర!



**హుస్నాబాద్,ఫ్లాష్ ఇండియా :** హుస్నాబాద్ పట్టణంలో కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమను కోతుల నుంచి కాపాడాలని కోరుతూ టీచర్స్ కాలనీకి చెందిన చిన్నారులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. చిన్నారులే స్వయంగా ముందుకొచ్చి తమ సమస్యను అధికారులకు వివరించడం కోతుల బెడద తీవ్రతను తెలియజేస్తోంది. టీచర్స్ కాలనీలో కోతులు తమపై దాడులకు దిగుతున్నాయని చిన్నారులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు వెళ్లే సమయంలో స్కూల్ బ్యాగులు చూసి వెంటపడుతున్నాయని, దసరా సెలవుల్లోనూ బయటకు వచ్చి ప్రశాంతంగా ఆడుకోలేకపోతున్నామని తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా భయపడాల్సి వస్తోందని పేర్కొన్నారు. కోతుల సమస్య టీచర్స్ కాలనీకే పరిమితం కాకుండా పట్టణంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఉందని స్థానికులు చెబుతున్నారు. గతంలోనూ కోతుల దాడులకు పలువురు గాయపడినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో కోతుల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కోతుల బెడదపై పలుమార్లు విజ్ఞప్తి చేసినా సమస్యకు పరిష్కారం లభించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, కమిషనర్, పాలకవర్గం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా కోతులను పట్టుకోవడం, పునరావాస చర్యలు చేపట్టడం ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారులు నిర్భయంగా పాఠశాలలకు వెళ్లేలా, ప్రజలు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. టీచర్స్ కాలనీకి చెందిన చిన్నారులు మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌వార్డు సెక్షన్ అధికారి గడిపే ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూదరి రుషికేష్, రోహన్, జక్కని రోహిత్, హార్షిత్, మోర అశ్విత్, శ్రీనిధి, రిషిక, మధుమిత, మన్వితతో పాటు కాలనీవాసులు అయిలేని మల్లికార్జునరెడ్డి, పూదరి సంపత్‌గౌడ్, సత్యనారాయణ, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బొద్దింకలతో పొత్తుకు ఈగ పార్టీ రాయబారం

**ఢిల్లీ :** బొద్దింకల పార్టీ.. అదేనండీ కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) ఎలా పుట్టుకొచ్చిందో ఐడియా ఉండే ఉంటుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చేసిన కామెంట్స్ తో వచ్చిన సీజేపీ దేశ రాజకీయాలను ఎలా మలుపు తిప్పుతోందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మళ్లీ అలాగే.. సీజేఐ కామెంట్స్ తోనే మరో కొత్త పార్టీ పుట్టుకొచ్చింది. అదే మఖ్కీ జనతా పార్టీ (ఎంజేపీ). మనభాషలో ఈగ పార్టీ అన్నమాట. స్థాపించిన 72 గంటల్లోనే 3 లక్షల 30 వేల ఫాలోవర్లు, 40 లక్షల వ్యూస్ వచ్చినట్లు పార్టీ ప్రకటించింది. ఆర్యన్ అనే స్టూడెంట్ ఈ పార్టీని స్థాపించాడు. దీనికి మంచి తెలివైన స్పోక్స్ పర్సన్స్ కావాలని పోస్ట్ చేసింది. 2021 జూన్లో పేజ్ క్రియేట్ చేయగా.. రీసెంట్ గా సీజేఐ చేసిన కామెంట్స్ తో మఖ్కీ జనతా పార్టీగా పేరు మార్చుకుంది.

**చీఫ్ జస్టిస్ కామెంట్స్ ఏంటి..:?**

ఇటీవల అక్టోబర్ 10న సీజేపీ తలపెట్టిన ఆందోళనల సందర్భంగా నిరసనకారులను అడ్డుకునేందుకు ఢిల్లీలో మెట్రో స్టేషన్లు మూసివేత, రైళ్ల రద్దు చేసింది ప్రభుత్వం. విచారణ సందర్భంగా.. ఈగను కొట్టేందుకు సుత్తెను వాడటమేంటని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ చేసిన కామెంట్స్ ఆధారంగా పార్టీ స్థాపించినట్లు ప్రకటించారు. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ.. నిరసనలను నియంత్రిచ్చవచ్చు కానీ.. అన్నింటినీ నిలిపివేయడం ఏంటి.. మీరు అన్నింటినీ ఆపలేరు. ఈగ కోసం సుత్తిని వాడినట్లుందని అన్నారు. ఈగను చంపేందుకు సుత్తెను వాడొద్దు అన్నారు కదా.. ఇప్పుడు ఈగ చెప్పేది కూడా అదే.. ఈగ ఎవరికీ తక్కువేమీ కాదు అంటూ పోస్ట్ చేశారు.

**సీజేపీ లీడర్స్, నేహా బొరాకు సంఘీభావం:**

కొత్తగా పుట్టిన ఎంజేపీ పార్టీ.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కు రాజీనామాక కోసం పోరాడుతున్న సీజేపీ లీడర్స్ కు, అదే విధంగా ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ మెంబర్ నేహా బొరాకు మద్దతు ప్రకటించింది. నేహా బొరా ధైర్యం, ఆమె పట్టుదల ఇన్ స్పైరింగ్ అంటూ పేర్కొంది. ఎంజేపీ పార్టీ కాక్రోచ్ పార్టీ నేతలతో కాంటాక్ట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంది. ఇరు పార్టీల మధ్య కోఆర్డినేషన్ కోసం.. అంగీకారం కుదుర్చుకునేందుకు ఈగ పార్టీ బొద్దింకల పార్టీతో రాయభారం నడిపుతోంది. అదే విధంగా జంతర్ మంతర్ దగ్గర సీజేపీ లీడర్లను అరెస్టు చేయడాన్ని ఎంజేపీ తప్పుపట్టింది. శాంతియుతంగా నిరసన చేయడం అందరి హక్కు.. జంతర్ మంతర్ తొలగించడం కరెక్ట్ కాదని పేర్కొంది. ప్రజాస్వామ్యానికి చర్చలు ముఖ్యం.. దూరం పెంచడం కాదంటూ శాంతియుత నిరసనలకు మద్దతు ఇస్తున్నట్లు పేర్కొంది.

# ఏపీలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల...




**ఆంధ్రప్రదేశ్ :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగరా మోగింది. మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. 100 అర్బన్ బాడీస్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 28న పోలింగ్, 30న ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. 10 నగర పంచాయతీలు, 77 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. అక్టోబర్ 16 నుంచి 18 వరకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకానుంది. 19 నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.



## దసరా సెలవులను ఆనందంగా గడపాలి

**పామూరు మండలం,మార్కాపురం జిల్లా , ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
దసరా సెలవులను విద్యార్థులు యువత వారి తల్లిదండ్రులు ఆనందంగా గడపాలని మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా సూచించారు. సెలవుల సమయంలో సరదాగా గడిపే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. గ్రామాలు పట్టణ శివారులోని చెరువులు, బావులు, కాలువలు ఇతర నీటి వనరుల వద్దకు పిల్లలు యువకులు ఈత కోసం వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## చిలుకూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా ఉచిత రక్తదాన శిబిరం...

### రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు,ప్రజాప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేసి చిలుకూరి బాలకృష్ణ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ రక్తదానం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని,రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రేగోడ్‌లో మహా రక్తదాన శిబిరం

- కలాం జయంతి సందర్భంగా నోబుల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, బహుమతుల అందజేత
- విజయవంతం చేయాలని అధ్యక్షుడు నరేష్ పిలుపు



**మెదక్ జిల్లా/రేగోడు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
భారతరత్న, మాజీ రాష్ట్రపతి డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని రేగోడ్ మండల కేంద్రంలో గురువారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నోబుల్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ మానవతా కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో గురువారం ఉదయం 10:00 గంటల నుండి ఈ రక్తదాన శిబిరం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. "మనం చేసే రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడుతుందని, ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవడం కన్నా మించిన సేవా కార్యక్రమం మరొకటి లేదని" అన్నారు. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ప్రసవాలు, రోడ్డు ప్రమాద బాధితులు, తలసేమియా వంటి వ్యాధులతో బాధపడే చిన్న పిల్లలకు రక్తం ఎంతో అవసరమౌతుందని గుర్తుచేశారు. ఈ శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసే ప్రతి ఒక్కరికీ అసోసియేషన్ తరఫున ప్రత్యేక ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేయనున్నట్లు తెలిపారు. మానవత్వానికి ప్రతీకగా నిలిచే ఈ మహత్తర కార్యక్రమంలో గ్రామ, మండల ప్రజలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన మనస్ఫూర్తిగా పిలుపునిచ్చారు.

## పామూరులో ఎంపీపీ, జడ్పీటీసీ రిజర్వేషన్లు ఇలా




**పామూరు మండలం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అధికారులు జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లను అధికారికంగా ప్రకటించారు. ఇందులో భాగంగా పామూరు మండలంలో జడ్పీటీసీ స్థానాన్ని Un Reserved (మహిళ) కు కేటాయించగా, ఎంపీపీ స్థానాన్ని Un Reserved చేశారు. ఈ రిజర్వేషన్ల ప్రకటనతో మండలంలో ఎన్నికల రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఏ పార్టీ నుంచి ఎవరెవరు బరిలో నిలుస్తారనే దానిపై స్థానికంగా చర్చలు మొదలయ్యాయి.

## శ్రీ శ్రీ తుల్జా భవాని విగ్రహా ప్రతీష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న కేతావత్ భీల్యా నాయక్



**నల్లగొండ జిల్లా / చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
చింతపల్లి మండల పరిధిలోని ఎర్రమట్టి తండా లో గల ఎంతో ప్రతీష్టాత్మకంగా నెలకొల్పిన శ్రీ శ్రీ తుల్జా భవాని విగ్రహా ప్రతీష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్ అనంతరం వారు మాట్లాడుతూ దసర పండుగ సమయంలో శ్రీ తుల్జా భవాని విగ్రహా ప్రతీష్ఠించడం చాలా శుభ పరిణామం అని అమ్మ వారి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా మెలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతి చందర్ నాయక్, జైపాల్ నాయక్,ఆలయ పూజారి మున్యా నాయక్,సక్రు నాయక్,గాంస్య బావోజి, వార్డు సభ్యులు జై-పాల్ నాయక్, జగ్నా బాణవత్,శ్రీను నాయక్, నరేష్,బాణావత్ హరి నాయక్,పర్స్య నాయక్,సుమన్,జయ బాణావత్,రాజు, కిషన్,రవిందర్, భీముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్**

చింతపల్లి మండల పరిధిలోని ఎర్రమట్టి తండాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన శ్రీ శ్రీ తుల్జా భవాని అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేతావత్ భీల్యా నాయక్ మాట్లాడుతూ.. దసరా పండుగ సమయంలో శ్రీ శ్రీ తుల్జా భవాని అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరగడం ఎంతో శుభపరిణామమని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతి చందర్ నాయక్, జైపాల్ నాయక్, ఆలయ పూజారి మున్యా నాయక్, సక్రు నాయక్, గాంస్య బావోజి, వార్డు సభ్యులు జైపాల్ నాయక్, జగ్నా బాణావత్, శ్రీను నాయక్, నరేష్, బాణావత్ హరి నాయక్, పర్స్య నాయక్, సుమన్, జయ బాణావత్, రాజు, కిషన్, రవీందర్, భీముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రజక ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్



**మహాదేవపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మెదక్ సిటీ సెంటర్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన బుధవారం మహాదేవపూర్‌లో డిమాండ్ చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేశారని శ్రీనివాస్ పేర్కొన్నారు. అటువంటి మహనీయురాలి విగ్రహాన్ని ధ్వంసం చేయడం అంటే తెలంగాణ చరిత్రను,సంస్కృతిని, ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాకలి ఐలమ్మ ఒక కులానికి మాత్రమే పరిమితమైన నాయకురాలు కాదని, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధురాలిగా యావత్ తెలంగాణ సమాజానికి స్ఫూర్తిప్రదాత అని అన్నారు. ఆమె త్యాగాలను, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన సమయంలో విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, ధ్వంసమైన విగ్రహం స్థానంలో ప్రభుత్వ ఖర్చులతో అదే విగ్రహాన్ని వెంటనే పునఃప్రతిష్ఠించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విగ్రహానికి తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను పంతకాని శ్రీనివాస్ కోరారు.



## శంషాబాద్‌లో వివాహ వేడుకలో పాల్గొన్న చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

**వికారాబాద్ జిల్లా/ చౌడపూర్ మండలం, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
చౌడాపూర్ మండల వ్యవసాయ అధికారిణి MAO వివాహ వేడుకలో చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం. చంద్రశేఖర్, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారిలో సర్పంచ్ లు. ఆత్మకమిటి డైరెక్టర్. PACS డైరెక్టర్స్. ప్రింట్ &ఎలక్ట్రానిక్ మీడియా. సీడ్స్ &ఫర్టిలైజర్ షాపు యజమానులు వైవాహిక జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ప్రేమానురాగాలతో ఆనందంగా సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. నూతన దంపతులకు హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాష్ట్రస్థాయి కోకో క్రీడాకారుల శిక్షణ శిబిరం ముగింపు



**మహాదేవపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాష్ట్రస్థాయి కోకో క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ క్రీడాకారులకు సూచించారు. మహాదేవపూర్ మండల కేంద్రంలో పీడీ గురుసింగాపూర్ణిమ ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కోకో క్రీడాకారుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమెతో పాటు ఎస్సై సాంబమూర్తి, సీనియర్ నాయకులు వామన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న మెళకువలను పోటీల్లో ప్రదర్శించి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి క్రీడాకారుల శిక్షణ శిబిరాన్ని మహాదేవపూ-ర్‌లో తొలిసారిగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ, ఇందుకు కృషి చేసిన నిర్వహణ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జాతీయస్థాయి క్రీడాకారులతో పాటు శిబిర నిర్వహణలో కీలక పాత్ర పోషించిన నిర్వాహకులు, సహకరించిన సీనియర్ క్రీడాకారులు నయ్యర్, అయ్యప్ప, తౌఫిక్, మణికంఠ, అనిల్, జావిద్, మిన్ను, కోచ్ అశోక్, రాజేందర్‌లను అభినందించి ఘనంగా సన్మానించారు. క్రీడాకారులకు శిక్షణ అందించడంతో పాటు రాష్ట్ర స్థాయిలో ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో తుల్జా భవాని ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



**మహబూబ్ నగర్ జిల్లా/జడ్చర్ల, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
జడ్చర్ల పట్టణంలోని 9వ వార్డు శంకరాయపల్లి తాండలో శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగోత్ మధు నాయక్ కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందజేశా-రు. అనంతరం మాజీ కౌన్సిలర్ చైతన్య చౌహాన్ మాట్లాడుతూ, భక్తిభావంతో ముందుకొచ్చి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించిన ఆంగోత్ మధు నాయక్ కుటుంబాన్ని అభినందించారు. అమ్మవారి ఆశీస్సులు ఆ కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ నాయక్, కిషన్ నాయక్, పాండు నాయక్, మన్యం నాయక్, మహేష్ నాయక్, బిచ్య నాయక్, దినేష్ నాయక్, సురేష్ నాయక్, విజయ నాయక్, వెంకటేష్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు!






**పెద్దపల్లి జిల్లా, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జైపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధులు, కేసుల దర్యాప్తు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన సీపీ.. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎస్ఐ భూమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. కేసుల వివరాలు, పోలీస్ రికార్డులు, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. సీసీటీఎన్ఎస్ వ్యవస్థ ద్వారా కేసులు, రికార్డుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానిత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, వారి ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ నిర్వహణ విధానాన్ని అమలు చేస్తూ కార్యాలయ పరిసరాలు, రికార్డులు, ఫైళ్లను పరిశుభ్రంగా, క్రమపద్ధతిలో ఉంచాలని సూచించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి సీసీటీఎన్ఎస్‌పై పూర్తి అవగాహన ఉండాలని, అవసరమైన వారికి ప్రత్యేక శిక్షణ అందించాలని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

**రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి**

పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. ప్రమాదాలు తరచుగా జరిగే ప్రాంతాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో హెచ్చరిక బోర్డులు, రహదారి సూచికలు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయించాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు రోడ్డు భద్రతపై నిరంతరం అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీలో జైపూర్ ఏసీపీ ఆర్. వెంకటేశ్వర్లు, సీఐ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## తమలపాకుల అలంకరణలో శ్రీ మహా చండి దేవి దర్శనం

**మహబూబ్ నగర్ జిల్లా/జడ్చర్ల , ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
శ్రీ శ్రీ సకల దేవతల దేవస్థానంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు అమ్మవారు శ్రీ మహా చండి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని తమలపాకులతో విశేషంగా అలంకరించి పుష్పార్చన, కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల పట్టణ ప్రజలు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## గోదావరిఖని సభకు ఎలిగేడు బీఆర్ఎస్ శ్రేణుల తరలింపు



**పెద్దపల్లి జిల్లా, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా గౌరవ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు గోదావరిఖనిలో ఈరోజు నిర్వహించే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభకు ఎలిగేడు మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు ఉత్సాహంగా బయలుదేరాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తినపర్తి స్రవంతి మోహన్ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, సుల్తానాపూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, ఉపసర్పంచ్ రమేష్ రావు, మండల రైతు కమిటీ అధ్యక్షుడు బద్దం తిరుపతిరెడ్డి, న్యాతరీ పోచాలు తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు రాజేశ్, సత్యం, నరేష్, లక్ష్మణ్, తిరుమలేశ్, తిరుపతి రెడ్డి, కుమార్, వినోద్, కార్తీక్, సంతు, సాయి నారాయణ, శ్రీనివాస్, గట్టయ్య, టిత్, సది తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు సభకు తరలివెళ్లారు.

## ఉప్పల్‌లో 300 పరుగుల లోడింగ్..! సాధ్యసాధ్యాలివే..



భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరగనున్న టీ20 సిరీస్‌లో భాగంగా నాల్కో మ్యాచ్ నేడు హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఈ మ్యాచ్‌లో భారీగా పరుగులు నమోదయ్యే అవకాశం ఉందని, సరికొత్త రికార్డులు సృష్టించబడే ఛాన్స్ ఉందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో ఇదే మైదానంలో బంగ్లాదేశ్‌పై భారత్ 297/6 పరుగుల భారీ స్కోర్ సాధించి, తమ అత్యధిక టీ20 అంతర్జాతీయ స్కోర్ రికార్డును నమోదు చేసింది. ఇప్పుడు వెస్టిండీస్‌తో జరిగే మ్యాచ్‌లో ఏకంగా 300 పరుగుల మార్క్‌ను అందుకుంటుందా లేదా అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 2–1 ఆధిక్యంలో కొనసాగుతుండగా, ఈ మ్యాచ్‌తో సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తోంది. మరోవైపు వెస్టిండీస్ జట్టుక సిరీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సి ఉంటుంది. కరీబియన్ బ్యాటర్ల దూకుడును బట్టి ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలంగా ఉండటం, ఒకవేళ మ్యాచ్ సమయంలో మంచు ప్రభావం ఉంటే బౌలర్లకు ఇబ్బందులు తప్పవు. ఇది బ్యాటర్లకు మరింత కలిసివచ్చే అంశం. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడే అభిషేక్ శర్మ లాంటి విధ్వంసకర ఆటగాళ్ల నుంచి మరోసారి అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆశించవచ్చు. బౌలింగ్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్ అద్భుతమైన ఫామ్‌లో ఉండటం జట్టుకు ప్లస్ పాయింట్. మొత్తానికి.. వాతావరణం సహకరిస్తే అభిమానులకు అసలైన పరుగుల విందు దొరకడం ఖాయం. మరోవైపు వెస్టిండీస్ కూడా బలమైన బ్యాటింగ్ లైనప్‌ను కలిగి ఉండటంతో మ్యాచ్ చివరి వరకు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ తన మునుపటి రికార్డును తిరగరాస్తుందా లేదా అనేది చూడాలి.

## భారత్ ప్లేస్ ఎక్కడో తెలుసా?




ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025--27 సైకిల్‌లో ఆస్ట్రేలియా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. దక్షిణాఫ్రికాతో డర్బన్‌లోని కింగ్స్‌మీడ్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఆసీస్ 214 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మూడు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మెట్ రెన్‌షా అద్భుత బ్యాటింగ్, జోష్ హేజిల్‌వుడ్ పదునైన బౌలింగ్ ఆసీస్ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా ఖాతాలో మరో 12 డబ్ల్యూటీసీ పాయింట్లు చేరాయి. డబ్ల్యూటీసీ పట్టికలో ప్రస్తుతం ఆస్ట్రేలియా 81.82 శాతం పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. 72.22 శాతంతో న్యూజిలాండ్ రెండో స్థానంలో ఉంది. తొలి టెస్టులో ఓటమితో దక్షిణాఫ్రికా (60) మూడో స్థానానికి పరిమితమైంది. 55.56 శాతం పాయింట్లతో బంగ్లాదేశ్ నాలుగో స్థానంలో ఉండగా.. భారత్ 51.52 శాతంతో ఐదో స్థానంలో ఉంది. ఇంగ్లాండ్ (38.54), శ్రీలంక (33.33), వెస్టిండీస్ (20.83), పాకిస్థాన్ (4.63) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. డబ్ల్యూటీసీ లీగ్ దశ ముగిసే సమయానికి పాయింట్ల శాతంలో అగ్రస్థానంలో నిలిచే రెండు జట్లు 2027 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. దీంతో రాబోయే టెస్టుల్లో ప్రతి జట్టుకూ పాయింట్లు కీలకం కానున్నాయి. ముఖ్యంగా ఐదవ స్థానంలో ఉన్న టీమిండియా.. ప్రతి మ్యాచ్ గెలవాల్సి ఉంటుంది.

# అభిషేక్ శర్మను పక్కనపెట్టేయండి!



భారత టీ20 జట్టులో ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లకు కొదవలేదు. ముఖ్యంగా ఓపెనింగ్ స్థానాల కోసం తీవ్ర పోటీ నెలకొంది. అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ వంటి ఆటగాళ్లు ఐపీఎల్‌లో తమ బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్నారు. ఇదే సమయంలో యువ సంచలనం వైభవ్‌కు జట్టులో నిలకడగా అవకాశాలు ఇవ్వకపోవడంపై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ప్లేయింగ్ 11ను తరచూ మార్చే విధానం ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తోందని 1983 వన్డే ప్రపంచకప్ విజేత, మాజీ భారత క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా వైభవ్ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ వ్యవహరించిన తీరును ఆయన విమర్శించాడు. భారత జట్టు మేనేజ్‌మెంట్ సంజు శాంసన్, వైభవ్ సూర్యవంశీల విషయంలో స్పష్టమైన ప్రణాళికతో వ్యవహరించలేదని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. వెస్టిండీస్ వంటి జట్టుతో జరిగే మ్యాచ్‌ల్లో వైభవ్‌కు వరుసగా మూడు అవకాశాలు ఇచ్చి ఉండాల్సిందని పేర్కొన్నాడు. అభిషేక్ శర్మకు ఇప్పటికే చాలా మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం లభించినందున.. అతడికి విశ్రాంతినిచ్చి వైభవ్, సంజులను ఓపెనర్లుగా ఆడించవచ్చని సూచించాడు. 'సంజు ఆత్మవిశ్వాసాన్ని మాత్రమే కాదు.. వైభవ్ ఆత్మవిశ్వాసాన్ని కూడా పూర్తిగా దెబ్బతీశారు. వెస్టిండీస్ వంటి జట్టుపై వైభవ్‌కు వరుసగా మూడు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఇచ్చి ఉండాల్సింది. అభిషేక్ శర్మను ఇప్పటికే చాలా కాలంగా చూశారు. కాబట్టి తదుపరి మ్యాచ్‌లో అతడికి విశ్రాంతినిచ్చి.. వైభవ్, సంజులను ఓపెనర్లుగా ఆడించవచ్చు' అని శ్రీకాంత్ వ్యాఖ్యానించాడు. వైభవ్ సూర్యవంశీకి తొలుత ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల కోసం భారత జట్టులో చోటు దక్కింది. ఇంగ్లండ్‌తో రెండో టీ20లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన అతడు.. ఆ తర్వాత మూడు మ్యాచ్‌ల్లో 14, 13, 15 పరుగులు చేశాడు. అయితే జింబాబ్వే పర్యటనలో తన ప్రతిభను చాటుకున్నాడు. వరుసగా 50, 20, 81 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అయినప్పటికీ జట్టులో ఆటగాళ్ల ఎంపిక, మార్పుల విషయంలో స్పష్టత ఉండాలని శ్రీకాంత్ సూచించాడు. యువ ఆటగాళ్లకు తగినన్ని అవకాశాలు ఇవ్వడం ద్వారా వారి సామర్థ్యాన్ని అంచనా వేయాలని అభిప్రాయపడ్డాడు. సంజు శాంసన్ ప్రదర్శనలో నిలకడ కొరవడుతోందని శ్రీకాంత్ పేర్కొన్నాడు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో సంజు కీలక ఇన్నింగ్స్‌లు ఆడి భారత విజయాల్లో భాగస్వామి అయ్యాడు. ముఖ్యంగా టోర్నీ చివరి దశలో అతడి బ్యాటింగ్ ఆకట్టుకుంది. అయితే ఆ తర్వాత అతడి ఫామ్ తగ్గింది. 'సంజు ఆట ఎప్పుడూ ఒడిదుడుకులతోనే ఉంటుంది. అతడి నిలకడపై ఎప్పుడూ ప్రశ్నలు ఉంటాయి. ప్రపంచ కప్‌లో ఒక్కసారిగా అద్భుతంగా ఆడతాడు. ఆ తర్వాత వరుసగా విఫలమవుతుంటాడు. అభిషేక్ శర్మలో మాత్రం ఇలాంటి తీవ్ర ఒడిదుడుకులు అంతగా కనిపించవు. ఇప్పుడు మళ్లీ తదుపరి మ్యాచ్‌లో సంజు పరుగులు చేస్తాడేమో' అని శ్రీకాంత్ వ్యాఖ్యానించాడు. భారత టీ20 జట్టులో ఓపెనింగ్ స్థానాల కోసం అభిషేక్, సంజు, ఇషాన్, వైభవ్ మధ్య పోటీ నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఆటగాళ్లను తరచూ మార్చడం కంటే.. వారికి నిర్దిష్టమైన పాత్రను అప్పగించి తగినన్ని అవకాశాలు ఇవ్వాలని శ్రీకాంత్ అంటున్నాడు.



## ఆస్కార్ కూడా పనికిరాదేమో.!

ఆఫ్ఘనిస్థాన్ క్రికెటర్ ఖైస్ అహ్మద్ చేసిన ఓ పని ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. బంగ్లాదేశ్‌తో జరిగిన ఏకైక టెస్టులో ఆఫ్ఘనిస్థాన్ డ్రా సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఖైస్.. మ్యాచ్ చివరి దశలో గాయం పేరుతో సమయం వృథా చేశాడనే కామెంట్స్ సోషల్ మీడియాలో గట్టిగా వినిపిస్తున్నాయి. అసలు విషయమేమిటంటే.. బంగ్లాదేశ్ నిర్దేశించిన 479 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆఫ్ఘనిస్థాన్ చివరి రోజు ఆటను 132/3తో ప్రారంభించింది. ఓపెనర్ సెదికుల్లా అటల్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 332 బంతుల్లో 111 పరుగులు చేశాడు. సుమారు ఎనిమిదిన్నర గంటల పాటు క్రీజులో నిలిచిన అతడి సెంచరీ.. టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ బ్యాటర్ సాధించిన తొలి సెంచరీగా నిలిచింది. అటల్ ఔటైన తర్వాత బంగ్లాదేశ్ విజయానికి దగ్గరైనట్లుగా కనిపించింది. కానీ అసలు విషయం జరిగింది. స్కోరు 281/7గా ఉన్న సమయంలో క్రీజులోకి వచ్చిన నంబర్-9 బ్యాటర్ ఖైస్ అహ్మద్.. ఆ తర్వాత మ్యాచ్‌ను పూర్తిగా మార్చేశాడు. ఆట ముగియడానికి కేవలం 10 నిమిషాల సమయం మాత్రమే ఉండగా.. తైజుల్ ఇస్లామ్ బౌలింగ్‌లో బంతిని డిఫెండ్ చేసిన ఖైస్ ఒక్కసారిగా ఎడమ తొడ పట్టుకుని నొప్పితో కుప్పకూలాడు. ఆ తర్వాత నెమ్మదిగా లేచి నడవడానికి ప్రయత్నించాడు. వెంటనే ఆఫ్ఘనిస్థాన్ ఫిజియో మైదానంలోకి వచ్చి అతడిని పరిశీలించాడు. ఈ ఘటనతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. కామెంటేటర్లు సైతం దీనిని 2024 టీ20 ప్రపంచకప్‌లో గుల్బదిన్ నైబ్ చేసిన ఘటనతో పోల్చారు. కామెంటేటర్ అహ్మద్ ఫర్వాద్ ఫిదాయ్ కూడా "ఖైస్ అహ్మద్ మళ్లీ చేశాడు.. ఇది గుల్బదిన్ నైబ్‌ను గుర్తు చేస్తోంది" అంటూ వ్యాఖ్యానించాడు. ఖైస్ గాయపడినట్లు కనిపించిన సమయంలో దాదాపు ఐదు నిమిషాల సమయం గడిచిపోయింది. దీంతో బంగ్లాదేశ్‌కు మరో ఓవర్ వేసే అవకాశం తగ్గిపోయింది. ఖైస్ అహ్మద్ కేవలం గాయం ఘటనతోనే కాకుండా బ్యాటింగ్‌తోనూ మ్యాచ్‌లో హైడ్రామా సృష్టించాడు. అతడు 7 పరుగుల వద్ద రనౌట్ నుంచి తప్పించుకున్నాడు. నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో బంగ్లాదేశ్ ఫీల్డర్ చేసిన సులభమైన రనౌట్ ప్రయత్నం విఫలమైంది. ఆ తర్వాత కూడా ఖైస్ దూకుడుగా ఆడాడు. కేవలం డిఫెన్స్‌తో సమయం గడపాల్సిన పరిస్థితిలో ఉన్నప్పటికీ.. దగ్గరగా ఫీల్డర్లను ఉంచిన బంగ్లాదేశ్ బౌలర్లపై భారీ షాట్లు ఆడాడు. 80 బంతుల్లో 9 ఫోర్లు సాధించాడు. ఒక భారీ షాట్‌కు హసన్ మహ్మూద్ సులభమైన క్యాచ్‌ను వదిలేయడంతో ఖైస్‌కు మరో లైఫ్ లభించింది. అంతేకాదు మ్యాచ్‌లో అత్యంత ఉత్కంఠభరితమైన ఘట్టం చివరి ఓవర్‌లో చోటుచేసుకుంది. ఖైస్ అహ్మద్ తైజుల్ ఇస్లామ్ బౌలింగ్‌లో బంతిని నేరుగా బౌలర్ మీదుగా భారీ సిక్సర్‌గా మలిచాడు. ఆ తర్వాత మూడు బంతులను జాగ్రత్తగా డిఫెండ్ చేసి ఆఫ్ఘనిస్థాన్‌ను డ్రా దిశగా తీసుకెళ్లాడు. అంతటితో ఆగకుండా చివరి బంతిని మిడ్‌వికెట్ మీదుగా మరో సిక్సర్‌గా కొట్టి మ్యాచ్‌ను డ్రాగా ముగించాడు. ఈ సమయంలో గ్యాలరీలో ఉన్న స్టార్ ఆఫ్ఘన్ క్రికెటర్ రషీద్ ఖాన్ కూడా నవ్వుతూ కనిపించాడు. ఖైస్ అహ్మద్ 80 బంతుల్లో అజేయంగా 49 పరుగులు చేశాడు. మరోవైపు యామిన్ అహ్మద్‌జాయ్ 85 బంతుల్లో 19 పరుగులు చేసి అతడికి అండగా నిలిచాడు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 110 బంతుల్లో 45 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఫ్ఘనిస్థాన్ చివరి రోజు 132/3తో ఆట ప్రారంభించి 142 ఓవర్లలో 346/8 వద్ద ఇన్నింగ్స్ ముగించింది. బంగ్లాదేశ్ తరఫున ఎబాదత్ హొస్సేన్ 3/50, మెహదీ హసన్ మిరాజ్ 3/73తో రాణించినా.. జట్టుకు విజయం అందించలేకపోయారు. సెదికుల్లా అటల్ 111 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా.. హష్మతుల్లా షాహిదీ 36 పరుగులు చేశాడు. ఇస్మత్ ఆలం 4 పరుగులకే పరిమితమైనప్పటికీ 60 బంతులు ఎదుర్కొని బంగ్లాదేశ్ బౌలర్లను విసిగించాడు. చివర్లో ఖైస్ అహ్మద్, యామిన్ అహ్మద్‌జాయ్, జియా-ఉర్-రెహ్మాన్ అద్భుత పోరాటంతో ఆఫ్ఘనిస్థాన్ ఓటమి నుంచి బయటపడింది.




## ప్రపంచంలోనే టాప్ కంపెనీల చిప్స్ భారత్‌లోనే డిజైన్



ప్రపంచ సాంకేతిక రంగంలో భారత్‌ను కీలక శక్తిగా నిలబెట్టే దిశగా దేశం అత్యంత పరిణతితో, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన ప్రతిష్టాత్మక 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్' సదస్సులో పాల్గొన్న ఆయన 'సాంకేతిక సార్వభౌమత్వం' అనే అంశంపై మాట్లాడారు. టెక్ సార్వభౌమత్వాన్ని సంపూర్ణ స్వావలంబన కోణంలో కాకుండా వ్యూహాత్మక పరస్పర ఆధారపడటం, పటిష్టమైన సరఫరా వ్యవస్థల దృక్కోణంలో చూడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఏయే రంగాల్లో ఉత్పత్తి, డిజైనింగ్, పూర్తిస్థాయి ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ సామర్థ్యాలు మన దేశంలోనే ఉండాలి.. ఏయే అంశాల్లో ఇతర దేశాలపై ఆధారపడాలనే స్పష్టత ప్రభుత్వానికి ఉందని తెలిపారు. టెక్నాలజీ అనేది ఎల్లప్పుడూ ప్రపంచ సరఫరా గొలుసుతో ముడిపడి ఉంటుందని, ఆ విలువైన వ్యవస్థలో భారత్ కీలక భాగస్వామి గా ఉంటూ అత్యున్నత విలువను జోడించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా సెమీకండక్టర్ రంగాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ.. ప్రస్తుతం ప్రపంచ దిగ్గజ సంస్థలైన ఎన్విడియా , క్వాల్‌కామ్ , ఏఎండీ వంటి బడా కంపెనీలకు చెందిన సరికొత్త 2-నానోమీటర్, 3-నానోమీటర్ చిప్‌లన్నీ భారతదేశంలోనే డిజైన్ అవుతున్నాయని మంత్రి వెల్లడించారు. చిప్ డిజైనింగ్ రంగంలో భారత్ ఇప్పటికే అంతర్జాతీయ కేంద్రంగా నిలిచిందని, ఆ తర్వాత దశలైన సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ , ఏటీఎంపీ (అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్) మరియు పూర్తిస్థాయి ప్రోడక్ట్ డిజైనింగ్ దిశగా దేశం సహజమైన పురోగతిని సాధిస్తోందని వివరించారు. కీలకమైన సాంకేతికతల్లో క్లిష్టమైన డిపెండెన్సీలను అధిగమిస్తూ, గ్లోబల్ వాల్యూ చైన్‌లో దేశ పాత్రను తిరుగులేని రీతిలో విస్తరించడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అశ్విని వైష్ణవ్ ఉద్ఘాటించారు.



## డాలరుపై రూపాయి ఎదురుదాడి..

అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ వరుస సెషన్లలో తన జోరును కొనసాగిస్తోంది. బుధవారం ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్ ఆరంభ ట్రేడింగ్‌లో దేశీయ కరెన్సీ మరో 36 పైసలు బలపడి డాలరుకు రూ. 95.00 స్థాయి వద్ద స్థిరపడింది. ముడి చమురు ధరలు స్థిరపడటం, దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ సంస్థాగత పెట్టుబడుల రాక మెరుగుపడటంతో పాటు గ్లోబల్ డాలర్ ఇండెక్స్ బలహీనపడటం రూపాయికి కలిసొచ్చింది. గత కొద్ది రోజులుగా వరుసగా లాభపడుతూ వస్తున్న రూపాయి, నేటి ప్రారంభ ట్రేడింగ్‌లోనూ విదేశీ కరెన్సీ వర్తకుల నుంచి భారీ డిమాండ్‌ను చూసింది. ఇటీవల రికార్డు స్థాయి పతనానికి చేరిన రూపాయిని రక్షించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న పటిష్ట నియంత్రణ చర్యలే ఈ భారీ పుంజుకోవడానికి ప్రధాన కారణమని ఫారెక్స్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. చమురు శుద్ధి సంస్థలకు ప్రత్యేక డాలర్ విండో ఏర్పాటు చేయడం, ఫారెక్స్ హెడ్జింగ్ లావాదేవీలపై నిబంధనలను కఠినతరం చేయడంతో మార్కెట్లో డాలర్ కృత్రిమ డిమాండ్ తగ్గింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా ఆర్బీఐ జరిపిన సమయస్ఫూర్తి జోక్యం రూపాయికి అదనపు బలాన్ని చేకూర్చింది. రాబోయే రోజుల్లో రూపాయి రూ. 94.50 నుంచి రూ. 95.50 శ్రేణిలో మరింత స్థిరత్వాన్ని సాధించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## వరుసగా పసిడి ధరలు పతనం..



పసిడి ప్రియులు, ఆభరణాల కొనుగోలుదారులకు బులియన్ మార్కెట్ తీపి కబురు అందించింది. గత 3 రోజుల్లోనే బంగారం ధర ఏకంగా రూ. 3,160 మేర తగ్గడం గమనార్హం. ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన మేలిమి బంగారంపై రూ. 1,030 తగ్గి రూ. 1,48,260 వద్దకు చేరింది. ఇక ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా ఇవాళ రూ. 950 తగ్గింది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో 22 క్యారెట్ల తులం గోల్డ్ రేటు రూ. 1,35,900 వద్ద ట్రేడ్ అవుతోంది. మరోవైపు వెండి ధరల్లో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. హైదరాబాద్‌లో ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 2,45,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.



## రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు

అక్టోబర్ 1వ తేదీన 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై ఒక్కసారిగా రూ. 62.50 పెరిగింది. ఈ పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ. 2,837.50కి చేరుకుంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లో రూ. 3,065కి, విజయవాడలో 2,932.50, విశాఖపట్నంలో రూ. 2,827.50కి ధరలు చేరాయి. ఇదిలా ఉంటే.. గృహ వినియోగ ఎల్‌పీజీ ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఈ రోజు(బుధవారం) రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో గ్యాస్ సిలిండర్ ధర రూ. 994.00గా, వరంగల్‌లో రూ. 1013.00గా ఉంది. ఇక, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన విశాఖపట్నంలో గ్యాస్ సిలిండర్ ధర రూ. 950.00గా, విజయవాడలో రూ. 966.50, గుంటూరులో రూ. 966.50గా ఉంది.




తాజాగా, కృతి శెట్టికి సంబంధించిన ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ భామ, ఇప్పుడు బాలీవుడ్‌లోకి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నట్లు టాక్.ఒక రొమాంటిక్ లవ్ స్టోరీతో హిందీ ఇండస్ట్రీలో అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి వద్ద సుదీర్ఘ కాలం పాటు పని చేసిన విధి ఘోడ్గాంకర్ తెరకెక్కించనున్నారట. ఏవీఎస్ స్టూడియోస్ బ్యానర్‌పై అభిషేక్ ఎస్ వ్యాస్ దీనిని నిర్మిస్తుండగా, ఈ ఏడాదే ఈ సినిమా షూటింగ్ పట్టాలెక్కనున్నట్లు సమాచారం. చిత్రంలో కృతి శెట్టిని ఒక సరికొత్త అవతార్‌లో చూపించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు మాత్రం తెలుగు, తమిళంలో కలిసిరాని అదృష్టం.. బాలీవుడ్‌లో అయినా కలిసొచ్చి సరైన హిట్ పడుతుందా? లేక నిరాశనే ఎదురవుతుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని...

## ఒళ్ళు గగుర్పొడిచేలా 'సుమో దీదీ' ట్రైలర్!




ఆడపిల్ల శరీరం ఎలా ఉండాలి, ఆమె బరువు ఎంత ఉండాలి, ఏ రంగాల్లో రాణించాలి అనే విషయాలపై సమాజం గీసిన గిరిగీతలను ప్రశ్నిస్తూ వెండితెరపైకి వస్తోంది సరికొత్త స్పోర్ట్స్ డ్రామా 'సుమో దీదీ'. భారతదేశపు మొట్టమొదటి మహిళా సుమో రెజ్లర్ హేటల్ దేవ్ జీవిత పోరాటాన్ని కళ్ళకు కడుతూ ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 హిందీ విడుదల చేసిన ఈ సినిమా అధికారిక ట్రైలర్ సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మహిళల బరువు, రూపురేఖలను చూసి గేలి చేయడం సమాజంలో ఎంతటి మానసిక క్షోభను కలిగిస్తుందో ట్రైలర్ ఆరంభంలోనే సూటిగా తాకింది. సాంప్రదాయ బద్ధమైన మార్వాడీ కుటుంబంలో పుట్టిన అమ్మాయిపై పడ్డ నిందలు, "బరువు తగ్గకపోతే నిన్ను ఎవరు పెళ్లి చేసుకుంటారు?" అనే మాటలు, స్పాన్సర్‌షిప్‌ల కోసం తిరస్కారాలు ఎదురైనా ఆమె ఏనాడూ వెనకడుగు వేయలేదు. తన బలహీనతగా లోకం వేలెత్తి చూపిన భారీ కాయాన్నే అతిపెద్ద ఆయుధంగా మార్చుకుని, జపాన్ దేశానికే సొంతమైన సుమో రింగ్‌లో భారత జెండాను రెపరెపలాడించిన హేటల్ నిజ జీవిత ప్రయాణం వెన్నులో వణుకు పుట్టించేలా కనిపిస్తుంది.జియో స్టూడియోస్, ఫ్రెష్ లైమ్ ఫిల్మ్స్, వీరాయిన ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి జయంత్ రోహత్గి దర్శకత్వం వహించారు. హేటల్ దేవ్ టైటిల్ పాత్రలో నటి శ్రియం భగ్నాని పరకాయ ప్రవేశం చేయగా, నటుడు చైతన్య శర్మ కీలక పాత్రలో కనిపించనున్నారు. జపాన్, ముంబై, కోల్‌కతాలలో చిత్రీకరించిన ఈ బయోపిక్ ఇప్పటికే టోక్యో, పామ్ స్ప్రింగ్స్ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. జీ5 హిందీ వేదికగా అక్టోబర్ 23, 2026 నుంచి స్ట్రీమింగ్ కానున్న 'సుమో దీదీ'.. సమాజం నిర్ణయించిన హద్దులను బద్దలుకొట్టి గెలవాలనుకునే ప్రతి ఒక్కరికీ ఓ బలమైన స్ఫూర్తిని నింపడం ఖాయం అని చెబుతోంది టీం.

## దైవిక శక్తి.. అంతుచిక్కని రహస్యం..



హీరో ఆది సాయి కుమార్ వరుస సినిమాలతో ఫుల్ జోష్‌లో దూసుకుపోతున్నారు. ఇటీవల 'శంబాల' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆయన, ఇప్పుడు మరోసారి అదే సక్సెస్‌ఫుల్ టీమ్‌తో కలిసి సరికొత్త ప్రాజెక్ట్ చేయడానికి సిద్ధమ-య్యారు. నవరాసన్ దర్శకత్వంలో ప్రశాంత్ జి రుద్రప్ప అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇది పూర్తిగా ఒక భారీ పాన్-ఇండియా మైథలాజికల్ మిస్టికల్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోంది. ఇక ఈ చిత్రానికి మ్యూజికల్ సెన్సేషన్ బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తుండటం విశేషం. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుండగా.. తాజాగా ఒక భారీ అప్డేట్ రాబోతున్నట్లు హీరో ఆది సాయి కుమార్ తన సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అక్టోబర్ 20న విడుదల చేయబోతున్నట్లు వెల్లడించారు. ఈ దసరా పండుగ సందర్భంగా ఒక అద్భుతమైన కొత్త అధ్యాయం మొదలుకాబోతోందని ఆయన తెలిపారు. "విశ్వాసమే పునాది.. రహస్యాల ఆవరణ.. ఒక దైవిక శక్తి.. అంతుచిక్కని రహస్యం.. మునుపెన్నడూ లేని ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభవం" అంటూ ఆది పెట్టిన క్యాప్షన్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నాయి. నిజంగా కన్నుల పండువగా ఉండే ఒక అద్భుతమైన దృశ్యాన్ని వెండితెరపై వీక్షించడానికి సిద్ధంగా ఉండాలని ఆయన రాసుకొచ్చారు. ఇక విడుదల చేసిన గ్లింప్స్‌లో ఓ ఎండిపోయిన చెట్టు కింద ఉన్న పుట్టపై అందరి దేవుళ్లకు సంబంధించిన అయుధాలు ఉండగా.. త్రిశూలాన్ని చుట్టుకుంటూ పైకి వచ్చిన నాగు పాము నాలుక బయటకు పెట్టి భయాందోళనకు గురి చేసేలా ఉంది. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అంచనాలను రెట్టింపు చేస్తోంది.



## 'మహావిజేత' ఫస్ట్ లుక్ విడుదల

తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ సోషల్ మీడియాలో షేర్ చేయగా, విపరీతమైన హైప్ క్రియేట్ చేస్తోంది. 'మహా విజేత' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోంది."ఒక ఉద్వేగభరితమైన కొత్త రూపం.. ఒక తీవ్రమైన కొత్త ప్రపంచం.. మిమ్మల్ని ఉత్కంఠభరితమైన ఉద్వేగంలో ముంచెత్తే ఒక మిషన్ రాబోతోంది" అంటూ వదిలిన క్యాప్షన్ సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రిన్స్ లుక్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. జాకెట్ ధరించి, చేతిలో గన్ పట్టుకుని యుద్ధానికి సిద్ధమైన సైనికుడిలా ఆయన పరుగులు పెడుతుండగా.. వెనకాల మంటలు ఎగిసిపడుతున్న నేపథ్యం సినిమాలోని యాక్షన్ ఏ స్థాయిలో ఉండబోతుందో స్పష్టం చేస్తోంది. లైట్‌స్టోర్మ్ సెల్యూలాయిడ్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ మూవీని నిర్మిస్తుండగా, అనిల్ కుమార్ రవికాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో ప్రిన్స్ పూర్తి స్థాయిలో మాస్ హీరోగా సక్సెస్ అందుకుంటారని అభిమానులు భావిస్తున్నారు.




## ఆకట్టుకుంటోన్న స్పెషల్ గ్లింప్స్

నేచురల్ స్టార్ నాని నిర్మాణంలో.. నితిన్ హీరోగా చేస్తున్న క్రేజీ ప్రాజెక్టు 'అలియాస్ రుక్మిణి'. ఈ సినిమాలో రుక్మిణి పాత్రలో ఏ హీరోయిన్ నటిస్తుందా అనే సస్పెన్స్‌కు తాజాగా తెర దించారు మేకర్స్. ఇందులో నితిన్ సరసన హీరోయిన్‌గా బాలీవుడ్ ప్రముఖ నిర్మాత సాజిత్ నాడియాడ్‌వాలా మేనకోడలు ఆఫియా సయ్యద్ నటిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఓ స్పెషల్ గ్లింప్ చేస్తూ.. 'కృష్ణుడి ప్రాణప్రదం.. ఏమాత్రం దాపరికం లేని, నిర్భయమైన, అత్యంత ప్రత్యేకమైన వ్యక్తిత్వం..!! ఆమెనే మన 'రుక్మిణి'.. రుక్మిణిగా ఆఫియా సయ్యద్‌ను పరిచయం చేసుకుందాం. అలియాస్ రుక్మిణి యొక్క ప్రాణం ఆమెనే..' అంటూ తెలిపారు. ప్రజెంట్ ఈ గ్లింప్స్ వైరల్ అవుతూ విశేషంగా ఆకట్టుకుంటోంది. కాగా.. మలయాళంలో బ్లాక్‌బస్టర్ హిట్ అయిన 'ప్రేమలు' సినిమాకు హిందీ రీమేక్‌గా వచ్చిన 'ప్రేమ్ కీటాను' చిత్రంతో ఈ ఆఫియా సయ్యద్ హీరోయిన్‌గా పరిచయమైంది. కానీ ఈ సినిమా పెద్దగా హిట్ అందుకోలేదు. మరి తెలుగులో అలియాస్ రుక్మిణితో ఎంట్రీ ఇస్తున్న ఈ అమ్మడుకి ఇక్కడ ఎలాంటి సక్సెస్ దక్కుతుందో వేచి చూడాల్సి ఉంది.

## ఏఐ దుర్వినియోగంపై శ్రియ శరణ్ ఫైర్

గత కొద్ది కాలంగా ఏఐ టెక్నాలజీ హీరోయిన్ల పాలిట శాపంగా మారుతోంది. కొంతమంది కేటుగాళ్లు పలు హాట్ వీడియోలను నెట్టింట షేర్ చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఎంతో మంది హీరోయిన్లు ఆవేదన వ్యక్తం చేయగా.. తాజాగా, హీరోయిన్ శ్రియా శరణ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సాంకేతికత పేరుతో కొందరు ఆకతాయిలు హీరోయిన్ల ఫోటోలను క్రియేట్ చేస్తూ ఆన్‌లైన్‌లో వదులుతున్న తీరుపై ఆమె స్పందించారు. తాను కూడా ఈ ఏఐ మోర్ఫింగ్ బాధితురాలినేనని చెప్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆన్‌లైన్‌లో తన మార్ఫింగ్ ఫోటోలు చక్కర్లు కొట్టడంపై శ్రియ మాట్లాడుతూ.. కొన్నిసార్లు ఆ ఫోటోలు చూస్తే అసలు అక్కడ ఉన్నది నేనేనా అని తనకు కూడా నవ్వొస్తుందని సరదాగా అన్నారు.మన శరీర భాగాల సైజులను ఇష్టమొచ్చినట్లు మార్చేయడం, మనం వేసుకున్న డ్రెస్సులను ఏఐ సాయంతో మాయం చేయడం లాంటివి చేస్తుంటారని తెలిపారు. ఇలాంటి పిచ్చి పనులను చూసి మొదట్లో తేలిగ్గా తీసుకున్నప్పటికీ, రోజురోజుకూ ఇది చాలా విసుగు తెప్పిస్తోందని, అసలు ఇది పద్ధతే కాదని ఆమె మండిపడ్డారు. ఏఐ టెక్నాలజీ వల్ల ఎన్నో లాభాలు ఉన్నప్పటికీ, దానివల్ల జరిగే నష్టాలు కూడా అంతే ప్రమాదకరంగా ఉంటాయని శ్రియ హెచ్చరించారు. టెక్నాలజీ అనేది ప్రతిసారీ ఒకలా ఉండదని, కాలం మారుతున్న కొద్దీ ఇలాంటి సరికొత్త సమస్యలతో ఎలా జీవించాలో లేదా వాటిని ఎలా ఎదుర్కోవాలో మనం నేర్చుకోవాల్సిందేనని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం శ్రియ చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.




## జిమ్ జిమ్ తార ఫుల్ సాంగ్ రిలీజ్




టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథాంశాలతో వస్తోన్న హా-రర్ కామెడీ చిత్రాల్లో ఇప్పుడు ఒకే ఒక్క పాట ఇండస్ట్రీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎస్ఎల్‌టీ ఫిలిమ్స్ బ్యానర్‌పై మంచి వెంకట్ నిర్మాణంలో, వై.జి. భరత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సస్పెన్స్, హారర్ కామెడీ థ్రిల్లర్ 'పర్ణశాల'. వినూత్న ప్రచార వ్యూహాలతో ఎప్పటికప్పుడు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతున్న ఈ సినిమా నుంచి తాజాగా విడుదలైన 'జిమ్ జిమ్ తార' పూర్తి పాట ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.ఈ చిత్రానికి సంబంధించి జి. లక్ష్మీదేవి స్వయంగా రాసి, తన మ్యాజికల్ వాయిస్‌తో ఆలపించిన 'జిమ్ జిమ్ తార' గీతం ఇప్పటికే నెట్టింట వైరల్ సెన్సేషన్‌గా మారింది. తాజాగా ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ పూర్తి పాట అధికారికంగా విడుదల కావడంతో, సినిమాపై అంచనాలు తారస్థాయికి చేరాయి. సాంగ్ ప్రోమోలు లేదా చిన్న బిట్స్ రాకముందే సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అయిన ఈ పాటకు.. ఇప్పుడు ఫుల్ వెర్షన్ వచ్చాక ఊహించని రీతిలో రెస్పాన్స్ వస్తోంది.సాధారణ ప్రేక్షకుల నుంచి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేసే కంటెంట్ క్రియేటర్ల వరకు అందరూ ఈ పాటకు ఫిదా అవుతున్నారు. సెలబ్రిటీలు సైతం తమ సోషల్ మీడియా హ్యాండ్స్‌లో ఈ పాటను వాడేస్తుండటంతో ఇది కాస్తా టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సందర్భంగా దర్శకుడు వై.జి. భరత్ మాట్లాడుతూ.. ప్రేక్షకుల నుంచి వస్తున్న ఈ అపూర్వ స్పందన తమ యూనిట్‌కు మరింత జోష్‌నిచ్చిందని, సినిమాపై అంచనాలను ఇది రెట్టింపు చేసిందని తెలిపారు.హారర్ కామెడీ జోనర్‌కు సరికొత్త సరిహద్దులు అద్దేలా రూపొందుతున్న 'పర్ణశాల' చిత్రంలో బలమైన సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉన్నాయని చిత్ర యూనిట్ చెబుతోంది. మొత్తానికి 'జిమ్ జిమ్ తార' మానియా చూస్తుంటే, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాల్సిందే!

## మళ్ళీ ప్రభాస్‌తో మూవీ..

పాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన విజువల్ వండర్ 'ది రాజాసాబ్' . భారీ అంచనాల నడుమ సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి వచ్చిన ఈ హారర్-కామెడీ ఎంటర్‌టైనర్, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయిన సంగతి తెలిసిందే. కలెక్షన్ల పరంగా కూడా ఈ సినిమా నిరాశపరిచింది. అయితే ఈ సినిమా ఫలితంపై, పరాజయానికి గల కారణాలపై నిర్మాత తాజాగా చేసిన వ్యాఖ్యలు ఫిలింనగర్ వర్గాల్లోనూ, సోషల్ మీడియాలోనూ చర్చకు దారితీశాయి.'ది రాజాసాబ్' చిత్రాన్ని సరైన సీజన్‌లో విడుదల చేయకపోవడమే సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోకపోవడానికి ప్రధాన కారణమని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అంగీకరించారు. సంక్రాంతి పోటీ నడుమ సరైన విండో, సీజన్‌ను ఎంచుకోవడంలో జరిగిన పొ-రపాటే సినిమా ఫలితాన్ని దెబ్బతీసిందని, మేకర్స్



ప్లానింగ్ లోపమే దీనికి కారణమని అభిప్రాయపడ్డారు. 'ది రాజాసాబ్' ఫలితంతో సంబంధం లేకుండా, రెబల్ స్టార్ ప్రభాస్‌తో తమ బ్యానర్‌లో మళ్లీ ఖచ్చితంగా సినిమా ఉంటుందని తెలిపారు. 2028లో ప్రభాస్ గారితో డెఫినెట్‌గా మరో ప్రాజెక్ట్ చేయబోతున్నాం అని ప్రకటించారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**